# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 28-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:22 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

క్రమమగు బోధన జేయగ
ప్రమదము మీరంగ రాష్ట్రపతిచే బహుమా
నము నందెడి క్షమతామయ
రమణిగ విఖ్యాతి గొనెను రాధారాజేష్ !!


జుచ్చు ఉదాద్యాజి దినోత్సజం హోజూ డిల్లో నాసపతి ద్రదఃపదీ జుుహ్మ గారి చ.తుల మీదుగా జా=జు ఉతఖిజు ఉ దాద్యాజూలిగా జీజు శ్ఢ+ ఉదాద్యాజూలు నాజుతి నాదారాజ;జు వీన్నిక కాజుడం చీందరికీ ఙంతోజుం కలిగించింది.



–రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

నీటి తగువు ఎన్నాళ్లు
నిప్పు ఉప్పు రాజేస్తది
రాష్ట్ర ప్రజల సహనాన్ని
రోజు రోజు కాజేస్తది.
నీటి బోర్డులెన్నేసినా
నిస్సత్తువ మాత్రలే
కేంద్రమాడే నాటకంలో
కీలుబొమ్మ పాత్రలే



–వేల్పుల నారాయణ
9440433475

# తీవ్ర విషాదాన్ని మిగిల్చిన నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన ఆకస్మిక వరదలు



## మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
## 100 మంది భారతీయుల ఆచూకీ లభ్యం
## సద్గురు ఈషా ఫౌండేషన్ బృందంలో 77 మంది గల్లంతు
## నేపాల్ ఇదే అతిపెద్ద విపత్తు
## నేపాల్ కు అండగా భారత్ సాయం



నేపాల్,ఆగష్టు 27: నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. భారీగా కొండచరియలు, బురద, రాళ్లు, నీటి ప్రవాహాలు దిగువ ప్రాంతాలను ముంచెత్తడంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 289 మంది మృతి చెందగా.. 800 మందికి పైగా గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. గల్లంతైన వారిలో పెద్ద సంఖ్యలో విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు ఉన్నారు. నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ ప్రకారం.. దాదాపు 300 మంది భారతీయ పర్యాటకులు గల్లంతైనట్లు తొలుత సమాచారం అందింది. అయితే వీరి కచ్చితమైన సంఖ్యపై నేపాల్, భారత్ ప్రభుత్వాలు ఇంకా అధికారికంగా స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు గల్లంతైన వారిలో సుమారు 100 మంది భారతీయుల ఆచూకీ లభించినట్లు సమాచారం.

నేపాల్‌లోని రసువా, ధాడింగ్, నువాకోట్ జిల్లాల్లో ఈ ఆకస్మిక వరదలు తీవ్ర ప్రభావం చూపాయి. భోటే కోషి నదికి ఉపనది అయిన లెండే ప్రవాహాన్ని హిమపాతం, శిథిలాలు అడ్డుకోవడంతో ఒక్కసారిగా భారీగా నీరు దిగువకు దూసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. నేపాల్-టిబెట్ సరిహద్దులోని తిమురే, రసువాగఢి ప్రాంతాలను మొదట వరద తాకింది. అక్కడి నుంచి భారీ నీటి ప్రవాహం దిగువ ప్రాంతాలకు చేరడంతో ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనేక ప్రాంతాల్లో వాహనాలు, ఇతర మౌలిక సదుపాయాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. టిబెట్‌లోని గిరాంగ్ కౌంటీలో కూడా పరిస్థితి తీవ్రంగా ఉంది. అక్కడ 558 మంది గల్లంతైనట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. గల్లంతైన వారిలో 260 మంది విదేశీయులు ఉన్నట్లు సమాచారం.

ఈ విపత్తుకు కారణంపై తొలుత భూకంపం, హిమపాతం వంటి అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే అమెరికా జియోలాజికల్ సర్వే ప్రాథమికంగా వెల్లడించిన వివరాల ప్రకారం.. హిమానీనదం( మంచు గడ్డల సమూహం) కూలిపోవడం, దాని కారణంగా భారీగా శిథిలాలు, నీరు దిగువకు ప్రవహించడం ఈ విపత్తుకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. భారీ ప్రవాహం దిగువ ప్రాంతాల్లోకి ఒక్కసారిగా దూసుకెళ్లడంతో ఈ విధ్వంసం సంభవించినట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై మరింత స్పష్టత కోసం నిపుణులు, అధికారులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.నేపాల్‌లో వరదల బీభత్సం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భారతీయులు చిక్కుకుపోయారు. మొత్తం 288 మంది భారతీయులతో ప్రస్తుతం ఎలాంటి సంబంధాలు లేవని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మరోవైపు చైనా వైపున సుమారు 200 మంది భారతీయులు చిక్కుకుపోయినట్లు సమాచారం అందిందని తెలిపింది.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరాల ప్రకారం.. నేపాల్‌లో చిక్కుకున్న భారతీయులు పలు వేర్వేరు బృందాలకు చెందినవారు. వీరిలో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది తొలి బృందంగా ఉన్నారు. అదేవిధంగా కైలాష్ మానసరోవర్ యాత్ర కోసం నేపాల్‌కు వెళ్లిన తమిళనాడుకు చెందిన 37 మంది, 49 మంది చొప్పున రెండు వేర్వేరు బృందాలు ఉన్నాయని జైస్వాల్ తెలిపారు. వీరు సమ్రాట్, ఫ్లై ఎవరెస్ట్ ట్రావెల్స్ ద్వారా యాత్రకు వెళ్లినట్లు పేర్కొన్నారు.

రసువా జిల్లాలోని తిమురే ప్రాంతంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన మరో 32 మంది భారతీయులు చిక్కుకున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. వీరు సమ్రాట్ ట్రావెల్స్ సహాయంతో ప్రయాణించినట్లు తెలిపింది. ఇక వివిధ రాష్ట్రాలకు చెందిన మరో 61 మంది, కేరళకు చెందిన 33 మంది భారతీయులు కూడా నేపాల్‌లో చిక్కుకున్న వారిలో ఉన్నట్లు జైస్వాల్ వివరించారు.

### 21 మంది భారతీయుల సురక్షితం..

నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యల్లో 21 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. వీరిలో తమిళనాడుకు చెందిన వారు ఉన్నారు. కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయం వారితో సంప్రదింపులు జరుపుతోంది.

రక్షించబడిన వారిని కాఠ్మండుకు తరలించి, అనంతరం భారత్‌కు తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీతో మాట్లాడి, భారత్ తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

### ఐదు ప్రధాన బృందాలు

నేపాల్‌లో ప్రస్తుతం సంబంధాలు లేని భారతీయులు ప్రధానంగా ఐదు బృందాలకు చెందినవారని ఓఇం తెలిపింది. త్రిశూలి-1 ప్రాజెక్టు సిబ్బందితో పాటు కైలాష్ మానసరోవర్ యాత్రికులు, వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు ఇందులో ఉన్నారు. వరదల కారణంగా రహదారులు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో గల్లంతైన వారితో సంబంధాలు ఏర్పరచుకోవడం అధికారులకు సవాల్‌గా మారింది. వారి ఆచూకీ తెలుసుకునేందుకు భారత, నేపాల్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు. చైనా వైపు కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అక్కడ సుమారు 200 మంది భారతీయులు చిక్కుకుపోయినట్లు సమాచారం అందడంతో వారి పరిస్థితిపై కూడా భారత అధికారులు దృష్టి సారించారు.

ఈ విపత్తు సంభవించిన ప్రాంతం కాఠ్మాండు-లాసా మార్గంలో, కైలాష్ మానసరోవర్ యాత్రికులు, ట్రెక్కింగ్ చేసే పర్యాటకులకు ప్రసిద్ధి చెందిన హిమాలయ ప్రాంతంలో ఉంది. దీంతో పలువురు భారతీయ యాత్రికులు కూడా వరదల్లో చిక్కుకున్నారు. తొలుత 133 మంది భారతీయులు, 37 మంది ఎన్నారైలు గల్లంతైనట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. అనంతరం గల్లంతైన భారతీయుల సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని సమాచారం వెలువడింది.

### సద్గురు ఈషా ఫౌండేషన్ బృందంలో 77 మంది గల్లంతు

టిబెట్‌లోని గ్యిరోంగ్ ప్రాంతంలో సంభవించిన భారీ ఆకస్మిక వరదలో సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు చెందిన ఈషా ఫౌండేషన్ కైలాష్ మానసరోవర్ యాత్ర బృందంలోని 77 మంది యాత్రికులు గల్లంతయ్యారు. కైలాష్ యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో ఈ బృందం గ్యిరోంగ్‌లోని ఇమ్మిగ్రేషన్ కార్యాలయం వద్ద ఉండగా అకస్మాత్తుగా వరద ముంచెత్తినట్లు సద్గురు తెలిపారు. వరద తీవ్రతకు ఇమ్మిగ్రేషన్ కార్యాలయ భవనంతో పాటు పట్టణంలోని పెద్ద భాగం నీట మునిగినట్లు సమాచారం. టిబెట్‌లోని గ్యిరోంగ్ పోర్ట్ ప్రాంతం నుంచి భారీ వరద ఉప్పెన దూసుకొచ్చి ఇమ్మిగ్రేషన్ కార్యాలయాన్ని తాకిన దృశ్యాలు కూడా వెలుగులోకి వచ్చాయి. అనంతరం వరద ప్రవాహం నేపాల్ వైపు ప్రవహించి రసువా జిల్లాలోని భోటే కోసి నది పరివాహక ప్రాంతంలో భారీ విధ్వంసం సృష్టించింది.

గల్లంతైన 77 మంది యాత్రికుల ఆచూకీపై ఇప్పటివరకు అధికారిక సమాచారం అందలేదని ఆయన వెల్లడించారు. తమ వాలంటీర్లు, సహాయక బృందాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని, అధికారులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈషా ఫౌండేషన్‌కు చెందిన మొత్తం 21 కైలాష్ యాత్ర బృందాల్లో 495 మంది ఇప్పటికే సురక్షితంగా తిరిగి వచ్చినట్లు సద్గురు వెల్లడించారు. మరో 743 మంది టిబెట్‌లో, 148 మంది నేపాల్‌లో ఉన్నట్లు తెలిపారు. అదనంగా ముగ్గురు వాలంటీర్లు నేపాల్‌లోని టిమురే ప్రాంతంలో ఉన్నట్లు పేర్కొన్నారు.

---

# కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ వేములవాడలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు ఉపాధ్యాయులు ఉత్సాహంగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రేమ, ఆప్యాయత, సోదరభావం, పరస్పర గౌరవం,బాధ్యత వంటి విలువలను విద్యార్థులకు తెలియజేసేలా వేడుకలు జరిగాయి.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్షాబంధన్ పండగ యొక్క ప్రాధాన్యతను చాటారు. పాఠశాల ప్రాంగణంలో వేడుకలు ఆనందంగా, క్రమశిక్షణతో కొనసాగాయి. విద్యార్థులలో సోదరి సోదర భావం పెంపొందించడానికి, దేశ ఔన్నత్యానికి ఈ పండగలు దోహ పడతాయని కరస్పాండెంట్ నరాల దేవేందర్,ప్రిన్సిపాల్ ధరక్షన్ వసుపియా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ వారు విచ్చేసి విద్యార్థులకు రక్షాబంధన్ పండగ గురించి, మన సంస్కృతి సాంప్రదాయాల గురించి, రక్షాబంధన్ విశిష్టత గురించి వివరించి విద్యార్థిని విద్యార్థుల చేత రక్షాబంధన్ కట్టించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు, టీచర్స్ , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# గౌతమ్ మోడల్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు రాఖీ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్స్ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపించి తమ సోదరా భావాన్ని అనురాగాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు రక్షాబంధన్ పండుగకు ఎంతో విశిష్టత స్థానం ఉందని తోబొట్టుల మధ్య ప్రేమానురాగాలను పెంపొందించడమే కాకుండా సమాజంలో సోదరా భావాన్ని చాటి చెప్పే గొప్ప పండుగని పేర్కొన్నారు విద్యార్థులు చదువులతో పాటు మన సంస్కృతి సాంప్రదాయ విశిష్టతను తెలియజేయడమే ఈ కార్యక్రమం లక్షమని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు

# బోల్తా పడిన పెళ్లి బస్సు..35 మందికి గాయాలు



కేరళ, ఆగష్టు 27:కేరళలోని ఎర్నాకుళం జిల్లా కూతట్టుకుళం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.బైకర్ ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో బస్సు డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బ్రేక్ వేశాడు. అయితే వేగంగా వెళ్తున్న బస్సు అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ ప్రాంగణంలోకి ప్రవేశించి ఓ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించిన భయానక దృశ్యాలు పెట్రోల్ బంక్ వద్ద ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బస్సు అదుపుతప్పి వేగంగా దూసుకెళ్లి బోల్తా పడిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్సు వేగం, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడానికి దారితీసిన పరిస్థితులు తదితర అంశాలను పరిశీలిస్తున్నారు.

# ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖది
# ఏ నిర్ణయమైనా స్వాగతిస్తాం: మహేశ్ గౌడ్

నిజామాబాద్, ఆగష్టు 27: మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు.


కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని మహేశ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు నాఖీ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్ చెప్పిన తెలంగాణ సర్కార్

హైదరాబాద్, ఆగస్టు 27: ఆటో డ్రైవర్లకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది.

ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఎలక్ట్రిక్‌గా మార్చే ప్రక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వైద్యం పేరుతో మోసం.. నకిలీ వైద్యుల ఉచ్చులో పడొద్దు: సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఆగస్టు 27: వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. నగరంలో ఇప్పటివరకూ 12 మంది నకిలీ వైద్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. కనీస వైద్య పరిజ్ఞానం, విద్యార్హతలు లేకుండానే వైద్యులుగా చలామణి అవుతూ రోగులకు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను విచక్షణారహితంగా ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇష్టారీతిన ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కించడం ద్వారా రోగుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని, సరైన వైద్యం అందకపోతే ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

నకిలీ వైద్యుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద ఆఓఊా జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో పరిశీలించాలని, వైద్యుల బోర్డుపై పేరు, విద్యార్హతలతో పాటు ఖాఓఅ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. వైద్యుడి అర్హతలపై అనుమానం ఉంటే నీనిశ్రీతినివబిబఎఇ.తినిలోని డాక్టర్ సెర్చ్ ద్వారా వివరాలు పరిశీలించాలని సూచించారు. ఖాఓఅ రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే వైద్యుడి అర్హతపై అనుమానించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చికిత్సపై సందేహం ఉంటే అర్హత కలిగిన మరో వైద్యుడి వద్ద సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని, నకిలీ వైద్యుల సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు. నకిలీ వైద్యులపై నిఘా, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అన్ని భాషలకు ఆధారమైనది సంస్కృతం

## (28 ఆగష్టు "ప్రపంచ సంస్కృత భాష దినోత్సవం" సందర్భంగా)

ఇండో-యూరోపియన్ మాండలికాల నుండి ఆవిర్భవించిన అతి పురాతన సంస్కృత భాష హిందూ సమాజ ఆదరణ, ఆధ్యాత్మిక భావనలకు ప్రతిరూపంగా కొనసాగుతున్నది. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలకు నెలవుగా సంస్కృతం పేరు గాంచింది. భారతీయ నాగరితతో విడదీయరానిబంధాలను పెనవేసుకున్న సంస్కృత భాష ప్రాధాన్యాన్ని, ప్రయోజనాలను, పునరుజ్జీవన ప్రయత్నాలను, రేపటి తరానికి భాష రుచిని పరిచయం చేయడం, భాషా సౌందర్యాలను అవగాహన పర్చడానికి ప్రతి ఏట శ్రావణ మాస పూర్ణిమ పుణ్య గడియల్లో, అనగా 28 ఆగష్టు 2026న "విశ్వ సంస్కృత దివస్" లేదా "ప్రపంచ సంస్కృత దినోత్సవం" పాటించడం 1969 నుంచి ఆనవాయితీగా మారింది. భారత్‌లో రక్షాబంధన్ లేదా రాఖీ పౌర్ణమి రోజున ప్రపంచ సంస్కృత దినం జరుపుకోవడం పరిపాటి అయ్యింది. ప్రముఖ సంస్కృత పండితుడు, వ్యాకరణకర్త అయిన పాణిని జన్మదినం సందర్భంగా ప్రపంచ సంస్కృతి దినం పాటించడం ముదావహం.

### అన్ని భాషల తల్లి లేదా దేవతల భాష:

అత్యంత పురాతనమైన సంస్కృత భాషకు ప్రత్యేక లిపి ఇతర భాషల నుంచి ఉద్భవించింది. పాణిని, కాళిదాస్, పతంజలి, వేదవ్యాసుడు, ఆదిశంకరాచార్యుడు లాంటి ప్రముఖులు సంస్కృత భాషకు పట్టం కట్టిన వ్యక్తులుగా నిలిచి పోయారు. ఋ?షులను సంస్కృత సాహిత్య మూల వనరులుగా భావిస్తాం. అందువల్లనే శ్రావణి పూర్ణిమ లేదా రాఖీ పూర్ణిమను బుల్షిట్ పర్వంగానే కాకుండా ప్రపంచ సంస్కృత దినం పాటిస్తున్నాం. అన్ని భారతీయ భాషలకు తల్లి అయిన సంస్కృతాన్ని "అన్ని భాషల తల్లి" అని మాత్రమే కాకుండా "దేవతల భాష"గా కూడా పిలుస్తున్నాం.

దాదాపు 3500 ఏండ్ల క్రితం భారతంలో పుట్టిన సంస్కృతాన్ని దేవతల భాషగా పిలుస్తాం. సంస్కృత భాషను కంప్యూటర్ సైన్స్, తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, గణితం, మత సంప్రదాయాలు, సాహిత్యం, సైన్స్, కళల అభివృద్ధికి ఉపగించడం సంతోషదాయకం.

### బహుళ ప్రచారం పొందిన సంస్కృత నినాదాలు:

సంస్కృత భాష నుంచి ప్రఖ్యాత నినాదాలు పుట్టడం, ప్రజాదరణ పొందడం జరిగింది. "సర్వే భవంతు సుఖినః (అందరూ సంతోషంగా ఉండాలి)", "విద్యా దదాతి వినయం (జ్ఞానం వినయాన్ని ఇస్తుంది", "సత్యం వద్ద ధర్మం చర (నిజం మాట్లాడండి ; ధర్మాన్ని పాటించడం)", లోకః సమస్తాః సుఖినో భవంతు (అని లోకాల జీవులు సంతోషంగా ఉండాలి)" లాంటివి బహుళ ప్రచారం, ప్రభావాలను కలిగి ఉంటూ, సామాన్య జనాల నాలుకల్లో నానుతూ ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధః డిజిటల్ భాషాశాస్త్రంలో సంస్కృతం పాత్ర వెలకట్టలేనిది.

ప్రపంచ సంస్కృత దినం రోజున విద్యాలయాల్లో సంస్కృత శ్లోకాల పఠనం, వ్యాస రచన, ఉపన్యాస, పేయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించవచ్చు.

అదే విధంగా సెమినార్లు, వెబినార్లు, కార్యశాలలు, ప్రవచనాలు లాంటి కార్యక్రమాలను కూడా నిర్వహించవచ్చు. విద్యార్థులు, యువత, భాషావేత్తలు, ఉపాధ్యాయులు, భాషా సంఘాలు చేయి చేయి కలిపి సంస్కృత పునవైభవానికి కృషి చేస్తూ, మన భాషా తల్లిని ప్రపంచ మానవాళికి రుచి చూపే ముమ్మర ప్రయత్నాలు చేద్దాం.



-మధుపాళీ
9949700037

# రైల్వే, రహదారులు, విద్యుత్ రంగాల్లోని ఆరు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై సమీక్ష

న్యూ ఢిల్లీ, ఆగష్టు 27:క్రియాశీలక పాలన, సకాలంలో అమలు లక్ష్యంగా గల, ఐసీటీ ఆధారిత బహుళ-విధాన వేదిక ప్రగతి 53వ సమావేశం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు ఉదయం సేవా తీర్థ్ వేదికగా జరిగింది.

రైల్వేలు, రహదారులు, విద్యుత్ రంగాలకు సంబంధించి తొమ్మిది రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఆరు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఈ సమావేశంలో ప్రధానమంత్రి సమీక్షించారు. వీటి మొత్తం వ్యయం రూ.30,000 కోట్లకు పైగా ఉంది. అనుసంధానాన్ని బలోపేతం చేయడానికి, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు మద్దతునివ్వడానికి, ప్రజా సేవలను మెరుగుపరచడానికి కీలకమైన ఈ ప్రాజెక్టులను... కాలపరిమితులకు కట్టుబడి ఉండటం, వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ప్రధానమంత్రి సమీక్షించారు.

మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం వల్ల వ్యయంలో పెరుగుదల మాత్రమే కాకుండా... పౌరులు, వ్యాపార, ఆర్థిక వ్యవస్థకు అందాల్సిన ప్రయోజ జనాలలా ఆలస్యమవుతాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను విడివిడి విభాగాలుగా, భాగాలుగా, ప్యాకేజీలుగా కాకుండా... ఒక సమగ్రమైన భాగంగా పరిగణిస్తూ పర్యవేక్షించాలని ఆయన అన్నారు. ఒక్కో ప్యాకేజీలో సాధించిన పురోగతి... అంతిమంగా మొత్తం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి, కార్యాచరణలోకి తీసుకురావడానికి దోహదపడాలని ఆయన పేర్కొన్నారు. దీని కోసం మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు సమగ్రమైన విధానాన్ని అవలంబించాలని సూచించారు. ప్రాజెక్టుల ప్రారంభాన్ని, ప్రయోజనాల పంపిణీని ఆలస్యం చేయగల కీలక లోపాలను పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రాజెక్టు అమలులోని ప్రతి స్థాయిలో మరింత యాజమాన్య భావాన్ని పెంపొందిస్తూ... మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల్లో చురుకైన పని సంస్కృతిని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రధాన రవాణా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రణాళిక సమయంలో... సాధ్యమైన చోటల్లా మౌలిక సదుపాయాల సేవల కోసం ఉమ్మడి వినియోగ కారిడార్లను అన్వేషించాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. అటువంటి సమీకృత విధానాల సాంకేతిక, ఆర్థిక సాధ్యతను దృష్టిలో ఉంచుకుని... ప్రణాళిక దశలోనే వాటిని పరిశీలించాలని ఆయన మంత్రిత్వ శాఖలకు, రాష్ట్రాలకు పిలుపునిచ్చారు.

పనుల అమలులో వేగంతో పాటు నాణ్యత విషయంలోనూ రాజీ పడకూడదని ప్రధానమంత్రి అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ... ప్రతి దశలోనూ నాణ్యత హామీ, పర్యవేక్షణను బలోపేతం చేయాలని ఆయన మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, అమలు చేసే సంస్థలకు పిలుపునిచ్చారు.

డిజిటల్ వ్యవసాయ మిషన్ కింద అగ్రిస్టాక్ సంబంధిత సమీక్షలో... వ్యవసాయ డేటా నుంచి మరింత విలువను రాబటడానికి కృత్రిమ మేధ సహా సరికొత్త డిజిటల్ టెక్నాలజీలను వినియోగించుకోవాల్సిన అవసరాన్నీ ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఇన్‌పుట్ ప్రణాళిక నుంచి ప్రాసెసింగ్ వరకు, వ్యవసాయ సంబంధిత వాణిజ్య కార్యకలాపాలన్నింటిలో డేటా వ్యవస్థను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. తద్వారా మరింత సమాచారంతో కూడిన కార్యాచరణకు, మెరుగైన లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి వీలుంటుందని ఆయన ఉద్ఘాటించారు. అగ్రిస్టాక్ వ్యవస్థను నిర్మించడంలో రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. రైతులకు మెరుగైన ఫలితాలను అందించడానికి దీని వినియోగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

డిజిటల్ అరెస్టుల వంటి ఘటనలు సహా సైబర్ మోసాల కేసుల సమీక్ష సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... శిక్షణ, అవగాహన, సంబంధిత విద్యపై నిరంతర దృష్టితో నివారణను బలోపేతం చేయాలన్నారు. సాధారణంగా మోసం చేయడం కోసం ఉపయోగించే పద్ధతులు, హెచ్చరిక సంకేతాలు, సురక్షిత డిజిటల్ పద్ధతుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, యువత, ఇతర బలహీన వర్గాల కోసం నిరంతర, సముచిత ప్రజావహన ప్రచారాల ఆవశ్యకతనూ ఆయన స్పష్టం చేశారు. సైబర్ మోసాల విషయంలో కొత్త పద్ధతులను గుర్తించి, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు... ఇందులో పాలుపంచుకుంటున్న సిబ్బంది సామర్థ్యాలను మెరుగుపరచడం కోసం ఎప్పటికప్పుడు వారికి శిక్షణ అందించాలనీ ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

# భారత్-జపాన్ ఇండస్ట్రీ రౌండ్‌టేబుల్‌కు అధ్యక్షత వహించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఆగష్టు 27టోక్యోలో సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ అంశంపై నిర్వహించిన భారత్-జపాన్ ఇండస్ట్రీ రౌండ్‌టేబుల్‌కు అధ్యక్షత వహించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ భారత్-జపాన్ ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడంలో అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ రంగాల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ... టోక్యో వేదికగా ఈ రోజు నిర్వహించిన ప్రముఖ జపనీస్, భారతీయ పరిశ్రమ ప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షత వహించారు.

వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయే తకైచిలు అంచనా వేసిన ఆర్థిక భద్రతా భాగస్వామ్యానికి సెమీకండక్టర్లు, ఏఐ వంటి రంగాలు కీలక సహకారం అందిస్తున్నాయని శ్రీ గోయల్ పేర్కొన్నారు. ఈ వ్యూహాత్మక రంగాల్లో భారత్-జపాన్ మధ్య పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించడానికి, విస్తరించడానికి భారత ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని ఆయన పారిశ్రామిక ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

భారత సెమీకండక్టర్ల రంగంలో వేగంగా విస్తరిస్తున్న అవకాశాలను కేంద్ర మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. 2032 నాటికి దేశీయ సెమీకండక్టర్ల డిమాండ్ 150 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిప్ డిజైన్, సెమీకండక్టర్ యంత్రాలు, సామాగ్రి, ఫ్యాబ్రికేషన్, ఏటీఎంపీ/ఓఎస్ఏటీ, పరిశోధనాభివృద్ధి, మెరుగైన ప్రతిభ వంటి అంశాలను కవర్ చేస్తూ ప్రభుత్వం రూపొందించిన సమగ్ర సెమీకండక్టర్ వ్యూహాన్ని ఆయన వివరించారు. భారీ స్థాయి పెట్టుబడులను ప్రోత్సహించడానికి, దేశంలో ఒక సమగ్ర సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడం కోసం 'సెమికాన్ ఇండియా 1.0' కింద 10 బిలియన్ డాలర్లు, 'సెమికాన్ ఇండియా 2.0' కింద అదనంగా 15 బిలియన్ డాలర్ల కేటాయింపులకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

దేశంలోని విస్తారమైన నైపుణ్యం, ప్రతిభ కలిగిన నిపుణులను... జపాన్ అధునాతన సాంకేతికత, ఇంజనీరింగ్ సామర్థ్యాలు, పారిశ్రామిక నైపుణ్యంతో అనుసంధానించగల గణనీయ సామర్థ్యాన్ని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. ఇటువంటి పరస్పర సహకారాలు ఇరు దేశాల మధ్య పెట్టుబడి, ఆవిష్కరణ, తయారీ, సాంకేతిక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను సృష్టించగలవని ఆయన పేర్కొన్నారు.

టోక్యో ఎలక్ట్రాన్, డైఫుకు, ప్రిఫర్డ్ నెట్‌వర్క్స్, ఏబీఈజేఏ, మైన్‌బియామిత్సుమి, తనాకా ప్రెషియస్ మెటల్స్ టెక్నాలజీస్, ఫుజిఫిల్మ్ హోల్డింగ్స్, టోరే ఇండస్ట్రీస్, నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ హోల్డింగ్స్, మిజుహో ఫైనాన్షియల్ గ్రూప్, క్యోసెరా కార్పొరేషన్, ఫుజి ఎలక్ట్రిక్, టీవోకే, ఎయిర్ వాటర్ ఐఎన్‌సీ, రోమ్, టోమోగావా కార్పొరేషన్, ఎంయుఎఫ్‌జి బ్యాంక్ లిమిటెడ్, ఎన్ఇసి కార్పొరేషన్, యమయా ఎలక్ట్రానిక్స్, ఏఎన్‌ఏ ట్రేడింగ్, జెట్రో సహా సుమారు 21 ప్రముఖ జపనీస్ కంపెనీల ప్రతినిధులు ఈ రౌండ్‌టేబుల్‌కు హాజరయ్యారు. వివిధ భారతీయ బిజినెస్ ఛాంబర్స్, వ్యాపారవేత్తల ప్రతినిధి బృందాలూ ఈ రౌండ్‌టేబుల్‌లో పాల్గొన్నాయి.

పాల్గొన్న జపనీస్ కంపెనీలు భారత్‌లో సెమీకండక్టర్లు, ఏఐ రంగాల్లో పెరుగుతున్న అవకాశాలపై విశ్వాసం వ్యక్తం చేశాయి. మేక్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా, డెవలప్ ఇన్ ఇండియాల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. ఆయా రంగాల్లో తమ కార్యకలాపాలు, సామర్థ్యాలు, ప్రాజెక్టుల అమలు గురించీ ఆ కంపెనీలు కేంద్ర మంత్రికి వివరించాయి.

జపాన్ పరిశ్రమ ప్రతినిధులు ప్రస్తావించిన సూచనలు, ఆందోళనలకు స్పందిస్తూ... భారత ప్రభుత్వం ఈ సమస్యలను ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరిస్తుందని శ్రీ గోయల్ హామీ ఇచ్చారు. ఈ వ్యూహాత్మక రంగాల్లో భారత్-జపాన్ భాగస్వామ్య గణనీయ సామర్థ్యం గురించి భారత్ సంపూర్ణ అవగాహన కలిగి ఉందన్నారు. వేగవంతమైన పద్ధతిలో ఫలవంతమైన ఫలితాలను సాధించేందుకు గానూ టోక్యోలోని భారత రాయబార కార్యాలయం, న్యూఢిల్లీలోని సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాల ద్వారా పరిశ్రమతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు కొనసాగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

రౌండ్‌టేబుల్‌కి ముందు... జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ అకాజావా ర్యోసేతో శ్రీ గోయల్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.

ఈ ద్వైపాక్షిక సమావేశంలో ఇరువురు మంత్రులు ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు సహా ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్నీ సమీక్షించారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ)ను మరింత దూరదృష్టితో కూడినదిగా, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక అవకాశాలకు అనుగుణంగా ఉండేలా చేసేందుకు దాని సమీక్షను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని వారు చర్చించారు.

నూతన, అభివృద్ధి చెందుతున్న రంగాలు, తదుపరి తరం పరిశ్రమలు, తయారీ, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై ఇరువురు మంత్రులు చర్చించారు. జపాన్ నుంచి భారత్‌కు 10 ట్రిలియన్ జపాన్ యెన్ల ప్రైవేట్ పెట్టుబడుల లక్ష్యాన్ని సాధించే దిశగా స్థిరమైన పురోగతిని వారు గుర్తించారు. ఇది భారత్-జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రాపంచిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని వారు పేర్కొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

## తొమ్మిదిన్నర తులాల బంగారు ఆభరణాల అపహరణ



ఆదిలాబాద్, ఆగష్టు 27: కడెం మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో తొమ్మిదిన్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నీటిపారుదల శాఖ ఉద్యోగి టీ. పార్వతి బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్న బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. అనంతరం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చిన ఆమెకు వెనుకవైపు ఉన్న తలుపులు తెరిచి ఉండటం కనిపించింది. దీంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉంచిన 9.5 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు.దీంతో వెంటనే బాధితురాలు కడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న కడెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇంట్లో పరిస్థితిని పరిశీలించి చోరీ జరిగిన తీరును తెలుసుకు న్నారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కరీంనగర్, ఆగష్టు 27: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపెల్లి గ్రామానికి చెందిన శ్రీరామోజి రాజేష్ (23) రాజన్నపేట గ్రామంలో హిమజ జువెలరీ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన రాజేష్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్నేహితుడి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్నేహితులతో కలిసి కొంత గంజాయిని వినియోగించిన అనంతరం మిగిలిన గంజాయిని అలవాటు పడిన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రాజన్నపేట గ్రామంలోని హిమజ జువెలరీ షాప్ వద్ద రాజేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు వారి ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా లేదా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

## భైంసాలో ప్రతిభ చాటిన కేజీబీవీ విద్యార్థినులు



ఆదిలాబాద్, ఆగష్టు 27:నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)కు చెందిన విద్యార్థినులు అఖిల, భవాని రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. భైంసా పట్టణంలో నిర్వహించిన యోగా పోటీల్లో ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రత్యేక అధికారి తిరుమల తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి తిరుమల మాట్లాడుతూ విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు పాఠశాల సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. చదువుతో పాటు క్రీడలు, యోగా వంటి ఇతర రంగాల్లోనూ విద్యార్థినులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అఖిల, భవానిలను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థులు


## జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన ఐదుగురు క్రీడాకారులు..

ఆదిలాబాద్, ఆగష్టు 27: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆసిఫాబాద్ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

గురుకుల కళాశాలకు చెందిన పి. తీర్థబాయి జావెలిన్ త్రోలో, ఎం. చిన్నూబాయి 600 మీటర్ల మిడిల్ రిలేలో, ఎం. జంగుబాయి జావెలిన్ త్రోతో పాటు షాట్‌పుట్‌లో, ఎస్. శరణ్య డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కళాశాల వర్గాలు తెలిపాయి.

ఈ నెల 26, 27 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బి. అరుణ శ్రీ, వైస్ ప్రిన్సిపల్ కె. అనిత ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నిజామాబాద్ జాతీయ పసుపు బోర్డులో రైతు ముఖాముఖి, మార్కెట్ అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన గౌరవ తెలంగాణ గవర్నర్



నిజామాబాద్, ఆగష్టు 27:నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు (ఔిః) ప్రధాన కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన భారీ 'రైతు ముఖాముఖి మరియు మార్కెట్ అనుసంధాన కార్యక్రమాన్ని' గౌరవ తెలంగాణ గవర్నర్ ప్రారంభించారు. వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ పసుపు బోర్డు నిర్వహించిన ఈ కార్యక్రమం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడం మరియు అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ పసుపు స్థానాన్ని పదిలం చేయడం లక్ష్యంగా చేపట్టిన 'సున్హరీ మిట్టీ అభియాన్' లాంఛనప్రాయ ప్రారంభోత్సవంతో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

ప్రారంభోపన్యాసం చేస్తూ, నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు తెలంగాణ రైతుల చిరకాల కలను సాకారం చేసిన ఒక చారిత్రక ఘట్టమని గౌరవ గవర్నర్ కొనియాడారు. పసుపు బోర్డును సాకారం చేయడంలో పార్లమెంటు సభ్యులు (నిజామాబాద్) శ్రీ అరవింద్ ధర్మపురి చేసిన నిరంతర కృషిని ఆయన అభినందించారు. పసుపు కేవలం వ్యవసాయ పంట మాత్రమే కాదని, భారతదేశ సాంస్కృతిక మరియు ఆయుర్వేద వారసత్వానికి ('హరిద్ర మేహ నాశిని') ప్రతీక అని గవర్నర్ ఉద్ఘాటించారు. రైతాంగం 'సున్హరీ మిట్టీ అభియాన్' కింద ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలని, కోతానంతర విలువ జోడింపును చేపట్టాలని మరియు ఆసియా, యూరప్, జూంఅంతటా ప్రీమియం ప్రపంచ మార్కెట్లను కైవసం చేసుకోవడానికి అవశేష రహిత పసుపును ఉత్పత్తి చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన శ్రీ అరవింద్ ధర్మపురి మాట్లాడుతూ, సుగంధ ద్రవ్యాల రంగంలో పటిష్టమైన బ్యాక్ వర్డ్ ఇంటిగ్రేషన్ (వెనుకకు అనుసంధానం) అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఎగుమతిదారులు మరియు వాణిజ్య ప్రాసెసర్‌లు రైతుల ఉత్పత్తిదారుల సంస్థలతో (ఈఖూలతో) నేరుగా కొనుగోలు భాగస్వామ్యాలు మరియు సంస్థాగత ఒప్పందాలను ఏర్పరచుకోవాలని, తద్వారా మధ్యవర్తులను తొలగించి రైతుల ఆదాయాన్ని పెంచాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో గౌరవ శాసనసభ్యులు శ్రీ ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, శ్రీ పైడి రాకేష్ రెడ్డిలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. దాన కిషోర్ (ఐఏఎస్), జిల్లా కలెక్టర్ శ్రీ భవేష్ మిశ్రా (ఐఏఎస్), పోలీస్ కమిషనర్ శ్రీ సాయి చైతన్య (ఐపీఎస్) చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పసుపు ఎగుమతిదారులు, రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు తెలంగాణ ప్రాంతం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో పసుపు రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, ఒడిశా వంటి ప్రముఖ పసుపు పండించే రాష్ట్రాల నుండి వివిధ రకాల పసుపు వంగడాలను ప్రదర్శించే ఒక సమగ్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. పసుపు నూనె, ఓలియో రెసిన్స్, కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్ట్‌లు, కర్కుమిన్ టాబ్లెట్‌లు మరియు పసుపు తేనె వంటి ప్రీమియం విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రదర్శన సందర్శక ప్రముఖులను, రైతాంగాన్ని విశేషంగా ఆకర్షించింది.

జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి శ్రీమతి భవానీ శ్రీ (ఐఏఎస్) ప్రముఖులకు, ప్రతినిధులకు సాదర స్వాగతం పలికి, సున్హరీ మిట్టీ అభియాన్ ప్రాముఖ్యతను మరియు భారతీయ పసుపు పరిశ్రమ ప్రయోజనం కోసం జాతీయ పసుపు బోర్డు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ శ్రీ పల్లె గంగారెడ్డి కీలక ఉపన్యాసం చేస్తూ నాణ్యత పెంపు శిక్షణ, కోతానంతర మౌలిక సదుపాయాల సబ్సిడీలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాలపై బోర్డు వ్యూహాత్మక మార్గదర్శక ప్రణాళికను వివరించారు. జాతీయ పసుపు బోర్డు డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ప్రత్యూష్ టి.పి. అధికారిక వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## ఐసీజీఎస్ అజిత్‌ను భారత తీర రక్షక దళానికి అప్పగించిన గోవా షిప్‌యార్డ్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:ప్రముఖ ప్రభుత్వరంగ రక్షణ సంస్థ - గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్ఎల్) మరో కీలక మైలురాయిని అధిగమించింది. దేశీయ నౌకా నిర్మాణంలో భాగంగా అత్యాధునిక ఫాస్ట్ పెట్రోల్ వెసల్ (ఎఫ్‌పీవీ) - ఐసీజీఎస్ అజిత్ (యార్డ్ 1277)ను ఈరోజు భారత తీర రక్షక దళానికి అధికారికంగా అప్పగించింది.

అప్పగింత కార్యక్రమానికి ముందు ఫస్ట్ రీడింగ్ సెర్మనీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బ్రజేష్ కుమార్ ఉపాధ్యాయ్, డైరెక్టర్ (ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ నెల్సన్ డిసౌజా, ఎన్ఎం, ఐఎన్ (రిటైర్డ్), డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీ జహంగీర్ ఆలం అన్సారీ, డైరెక్టర్ (సీపీపీ అండ్ బీడీ) శ్రీ నాగేశ్ దాస్ పాయ్, డీఐజీ వి.కె. పర్మార్, టీఎం, పీడీ (ఎంఏటీ), ఐసీజీఎస్ అజిత్ కమాండింగ్ ఆఫీసర్ కమాండెంట్ (జీజీ) మనీష్ తలాన్‌తో పాటు భారత తీర రక్షక దళం, జీఎస్ఎల్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

65 శాతానికి పైగా దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన ఐసీజీఎస్ అజిత్, భారత స్వదేశీ రక్షణ నౌకా నిర్మాణ రంగం పెరుగుతున్న సామర్థ్యాలకు, కేంద్ర ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు ప్రతిబింబంగా నిలుస్తోంది.

51.43 మీటర్ల పొడవు, 8 మీటర్ల వెడల్పు కలిగిన ఈ నౌక 2.5 మీటర్ల డ్రాఫ్ట్ వద్ద 330 టన్నుల డిస్ప్లేస్‌మెంట్ కలిగి ఉంది. నియంత్రించగల పిచ్ ప్రొపెల్లర్లను నడిపించే రెండు మెరైన్ డీజిల్ ఇంజిన్లతో ఇది పనిచేస్తుంది. ఈ తరహా ఫాస్ట్ పెట్రోల్ వెసల్స్‌లో తొలిసారిగా ఈ సాంకేతికతను వినియోగించారు. దీని ద్వారా ప్రొపల్షన్ సామర్థ్యం, నిర్వహణ తీరు మరింత మెరుగుపడుతుంది.

గంటకు 27 నాటికల్ మైళ్లకు పైగా గరిష్ట వేగంతో ప్రయాణించగల ఈ నౌక 1,500 నాటికల్ మైళ్ల ప్రయాణ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కార్యకలాపాల సంసిద్ధత, సామర్థ్యం, సుస్థిరతను మరింత పెంపొందించేందుకు ఇందులో అధునాతన సమగ్ర యంత్రాంగ నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ఐసీజీఎస్ అజిత్‌ను ఆరుగురు అధికారులు, 35మంది నావికులతో కూడిన సిబ్బంది నిర్వహించనున్నారు. మత్స్య సంపద పరిరక్షణ, ప్రత్యేక ఆర్థిక మండలి పర్యవేక్షణ, తీర ప్రాంత గస్తీ, అక్రమ రవాణా నిరోధక, సముద్ర దోపిడీ నిరోధక కార్యకలాపాలతో పాటు గాలింపు, రక్షణ చర్యలు వంటి కీలక సముద్ర భద్రతా విధులను నిర్వహించేలా ఈ నౌకను రూపొందించారు.

ఐసీజీఎస్ అజిత్ ప్రవేశంతో భారత తీర ప్రాంతాలు, సముద్ర తీరానికి దూరంగా ఉన్న ప్రాంతాల భద్రతను పరిరక్షించడంలో భారత తీర రక్షక దళం సామర్థ్యాలు మరింత బలోపేతం కానున్నాయి. దేశ సముద్ర భద్రతా వ్యవస్థను పటిష్టం చేయడంలో కూడా ఇది కీలకం కానుంది. ఈ నౌకను అప్పగించడం ద్వారా భారత రక్షణ దళాల కోసం అత్యాధునిక, అధిక సామర్థ్యం కలిగిన నౌకలను అందించడంలో గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్ఎల్) నిబద్ధత మరోసారి స్పష్టమైంది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద దేశీయ నౌకా నిర్మాణాన్ని అభివృద్ధి చేయడం, రక్షణ రంగంలో స్వావలంబనను ప్రోత్సహించడం, ప్రపంచ స్థాయి నౌకా నిర్మాణ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి మద్దతు ఇవ్వడంలో జీఎస్ఎల్ పాత్రను ఇది మరింత బలోపేతం చేస్తుంది

సాంకేతికత, ఆవిష్కరణలు, స్వదేశీకరణపై నిరంతర దృష్టి సారిస్తూ, భారత సముద్ర సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు దేశ నీలి ఆర్థిక వ్యవస్థ (బ్లూ ఎకానమీ) అభివృద్ధికి దోహదపడేందుకు జీఎస్ఎల్ కట్టుబడి ఉంది.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా పూర్తి చేయండి

## మన ఓట్లను కాపాడుకుందాం...

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్

## బూత్ స్థాయి ప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలి




కరీంనగర్, ఆగష్టు 27: ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సర్వేను పారదర్శకంగా పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు స్పష్టం చేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ రెండో దశకు సంబంధించి బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన దుద్దిల్ల శ్రీనుబాబు సుదీర్ఘంగా మాట్లాడారు. సర్వే సందర్భంగా ఏ ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శిక్షణ సందర్భంగా మార్గదర్శకాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకొని బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న నియోజకవర్గాల్లో ఏ ఒక్క పట్టణ, గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓటు కూడా తప్పిపోవడానికి వీల్లేదన్నారు. మన ఓట్లను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సర్వే విజయవంతంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. సర్వే విజయవంతంగా కొనసాగేందుకు కాంగ్రెస్ ప్రతినిధులు బాధ్యతగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఓట్ల తొలగింపునకు కేంద్రం కుట్రలు చేస్తోందని, ఈ అంశాలను కాంగ్రెస్ శ్రేణులు గమనించాలని అన్నారు.

అందుకే మన ఓట్లను మనం కాపాడుకునే బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ నొక్కిచెప్పారు. ఇదిలా ఉండగా, కొందరు బూత్ స్థాయి ఏజెంట్లతో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం వాస్తవమేనని సమావేశంలో ప్రస్తావించినట్లు తెలిసింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ స్థాయి ఏజెంట్లపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఈ సమావేశంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, పరిశీలకులు దీపక్ రాథోడ్, ప్రభాకర్‌రెడ్డి, ఫహీం, కాంగ్రెస్ కార్పొరేషన్ ఏరియా అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనం ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

## విధులకు హాజరై పారిశుద్ధ్య పనులు చేస్తుండగా ఘటన



ఖమ్మం, ఆగష్టు 27:ఖమ్మం నగరానికి చెందిన మామిడాల నాగమ్మ (55) గురువారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతురాలు నాగమ్మ ఖమ్మం నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున నగరంలోని వన్‌టౌన్ పరిధిలోని బోనకల్ క్రాస్‌రోడ్ వద్ద పారిశుద్ధ్య విధులకు హాజరై పనులు చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీకొట్టి వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. వాహనం బలంగా ఢీకొట్టడంతో నాగమ్మ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు పరిసర ప్రాంతాల్లో వివరాలు సేకరిస్తున్నారు.

# భారత పటిష్టమైన పురోగతి అంశాలు, సెమీకండక్టర్లు, ఏఐ, స్వచ్ఛ ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాల్లోని అవకాశాలను ప్రస్తావించిన శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:దీర్ఘకాలిక పెట్టుబడులను బలోపేతం చేయటం, పెట్టుబడి భాగస్వామ్యాన్ని పెంపొందించటం, భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో జపాన్ భాగస్వామ్య విస్తరణపై ఆ దేశంలోని ప్రముఖ ఆర్థిక, పెట్టుబడి సంస్థల సీనియర్ నేతలతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఇవాళ టోక్యోలో చర్చలు జరిపారు.

ఎంయూఎఫ్‌జీ, డెవలంమెంట్ బ్యాంక్ ఆఫ్ జపాన్ (డీబీజే), మిజుహో, మోర్గాన్ స్టాన్లీ, నోమురా, నిప్పన్ లైఫ్ సంస్థల సీనియర్ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారతదేశ ఆర్థిక దృక్పథం, నూతన పెట్టుబడి అవకాశాలు, భారత్‌లో జపాన్ సంస్థాగత పెట్టుబడులను మరింత సులభతరం చేసే చర్యలపై ఈ చర్చలు దృష్టి సారించాయి.

భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థిరత్వాన్ని శ్రీ పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ప్రపంచ అనిశ్చితుల మధ్య గతేడాది భారత్ 7.7 శాతం వృద్ధి రేటును సాధించిందని, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు కృషి చేస్తోందని తెలిపారు. బలమైన భారత బ్యాంకింగ్ రంగం, పటిష్టమైన పెట్టుబడుల సామర్థ్యం, తగ్గిన మొండి బకాయిలు, పెరుగుతున్న మధ్యతరగతి వర్గం, పెరుగుతున్న వ్యక్తిగత ఆదాయాలు, నిలకడైన ఆర్థిక వృద్ధికి కీలక శక్తి అని తెలిపారు.

సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, అధునాతన తయారీ, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాల్లోని గణనీయమైన అవకాశాలను జపాన్ పెట్టుబడిదారులకు మంత్రి వివరించారు. ఇంధన వినియోగం ఎక్కువగా ఉండే డిజిటల్ పరిశ్రమల అభివృద్ధికి భారతదేశంలో పెరుగుతున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, జాతీయ విద్యుత్ గ్రిడ్ కీలక ఆధారంగా నిలుస్తున్నాయని... తయారీ, సాంకేతిక రంగాల్లో ఇండియా సెమీకండక్టర్ మిషన్ నూతన అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు.

భారత్-జపాన్ సంబంధాల వ్యూహాత్మక, సమగ్ర స్వభావాన్ని తెలియజేస్తూ... తయారీ, సాంకేతికత, పెట్టుబడి రంగాల్లో ప్రపంచ కేంద్రంగా మారే ప్రయాణంలో జపాన్‌ను విశ్వసనీయ భాగస్వామిగా భారత్ భావిస్తోందని శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు. మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ, అత్యుత్తమ ప్రతిభావంతులను కలిగి ఉండటం, విధానపరమైన సంస్కరణలు, మరింత అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని సృష్టించేందుకు భారత్ కట్టుబడి ఉందని వెల్లడించారు.

భారత్‌తో పెరుగుతున్న భాగస్వామ్యాన్ని పంచుకుంటూ... దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై జపాన్ ఆర్థిక సంస్థలు బలమైన విశ్వాసాన్ని వ్యక్తం చేశాయి. శ్రీరామ్ ఫైనాన్స్‌లో సుమారు 4 బిలియన్ డాలర్ల పెట్టుబడితో పాటు పునరుత్పాదక ఇంధనం, హైడ్రోజన్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తితో ఉన్నట్లు ఎంయూఎఫ్‌జీ పేర్కొంది. భారత వ్యూహాత్మకత, రియల్ ఎస్టేట్ అభివృద్ధి, వెంచర్ క్యాపిటల్, ఇతర దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలపై పెరుగుతున్న ఆసక్తిని డీబీజే వివరించింది.

భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న జపనీస్ కంపెనీల లాభం పెరుగుతోందని, పుణేలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌తో సహా భారత్‌లో కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు మిజుహో వెల్లడించింది. తమ కంపెనీకి అత్యంత కీలకమైన ప్రపంచ కేంద్రాల్లో భారత్ ఒకటని మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. ఇక్కడ 19,000 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారని, భారత్‌లోని కంపెనీ కార్యకలాపాలు అధిక విలువ గల మూలధన మార్కెట్లు, ఆర్థిక సేవల కార్యకలాపాల దిశగా ఎదుగుతున్నట్లు స్పష్టం చేసింది.

భారతదేశంలో దీర్ఘకాలిక ఉనికిని, జపాన్ కంపెనీలను, గ్లోబల్ పరిశ్రమలను భారతీయ అవకాశాలతో అనుసంధానించటంలో కీలక పాత్ర పోషించినట్లు నోమురా సంస్థ స్పష్టం చేసింది. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతిక సామర్థ్యాల ద్వారా కూడా ఇది సాధ్యమవుతోందని వెల్లడించింది. "దీర్ఘకాలిక పెట్టుబడి" ప్రాముఖ్యతను నిప్పన్ లైఫ్ స్పష్టం చేసింది. భారత్‌లో తమ సంస్థ కార్యకలాపాల ద్వారా అత్యధిక రాబడులు పొందుతున్నట్లు తెలిపింది.

భారతదేశంలోకి జపనీస్ సంస్థాగత పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా ఈ చర్చలు దృష్టి సారించాయి. లాభాలను స్వదేశానికి తరలించే ప్రక్రియను సరళతరం చేయటం, భారత పెట్టుబడుల మార్కెట్లలోకి ప్రవేశాన్ని సులభతరం చేయటం, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు మరింత నియంత్రణపరమైన నిలకడను కల్పించటం వంటి అంశాల ప్రాముఖ్యతను చర్చలో పాల్గొన్నవారు తెలియజేశారు.

భారత్‌పై దీర్ఘకాలిక వ్యూహాత్మక దృక్పథం సానుకూలంగానే ఉందని జపనీస్ సంస్థలు స్పష్టం చేశాయి. కరెన్సీ విలువలో హెచ్చుతగ్గులు, కొన్ని నియంత్రణ, విధానపరమైన అంశాలు... స్వల్పకాలిక పెట్టుబడి నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఈ అభిప్రాయాన్ని శ్రీ పీయూష్ గోయెల్ స్వాగతించారు. సులభతర వాణిజ్యాన్ని నిరంతరం మెరుగుపరిచేందుకు, అనువైన పెట్టుబడి వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు.

జపాన్, భారత్ మధ్య పెట్టుబడులను పెంపొందించటానికి వేదికగా, భారత్‌లోని అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే ద్వారంగా గిఫ్ట్ సిటీని వినియోగించుకునే అవకాశాలను ఈ సమావేశం పరిశీలించింది.

పెట్టుబడులు మాత్రమే కాక సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, తయారీ సామర్థ్యాలు, ఉపాధి, ప్రపంచ విలువ శ్రేణులతో అనుసంధానాన్ని పెంచే దీర్ఘకాలిక భాగస్వామ్యాలను భారత్ కోరుకుంటోందని శ్రీ పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. నూతన, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో... ఆధునీకరణ, సాంకేతిక నవీకరణకు అవసరమైన నిలకడైన వ్యాపార అవకాశాలను తెలియజేశారు. రాబోయే దశాబ్ద కాలంలో జపాన్ నుంచి భారతలోకి 10 ట్రిలియన్ యెన్ల ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం కల్పించాలనే భారత్-జపాన్ సంయుక్త లక్ష్యానికి ఈ చర్చలు ఎంతో ప్రాధాన్యతనిచ్చాయి. భారత వృద్ధి అవకాశాలపై ప్రముఖ జపాన్ ఆర్థిక సంస్థలకున్న ప్రగాఢ విశ్వాసాన్ని ఈ సమావేశం స్పష్టం చేసింది. ద్వైపాక్షిక పెట్టుబడులు, సాంకేతికత, వాణిజ్య సంబంధాల విస్తరణకున్న భారీ అవకాశాలను వెల్లడించింది. భారత్-జపాన్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయటానికి, భారత్ తదుపరి దశ వృద్ధిలోకి జపాన్ సంస్థాగత పెట్టుబడులను దీర్ఘకాలికంగా పెంచేందుకు ఈ సమావేశం మరో కీలక ముందడుగా నిలిచింది.

## పంచాయతీ కార్మికులకు ఖాకీ దుస్తుల పంపిణీ

ఖమ్మం, ఆగష్టు 27: గ్రామ పరిశుభ్రతకు పాటుపడుతున్న పంచాయతీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక పంచాయతీ కార్మికులు సాగర్, వెంకటేశ్వర్లకు గురువారం ఖాకీ దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీ కార్మికుల పాత్ర కీలకమని అన్నారు. విధుల్లో భాగంగా కార్మికులు ఖాకీ దుస్తుల నిబంధనను పాటించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సోడే కేశవరావు, కొండ్రు నాగరాజు, కొండ్రు చంటి, కల్లూరి రవి, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఆపద వచ్చినా అండగా ఉంటా..

## తన్నీరు నాగేశ్వరరావును పరామర్శించిన ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు



ఖమ్మం, ఆగష్టు 27:మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామ పంచాయతీకి చెందిన తన్నీరు నాగేశ్వరరావును ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు బుధవారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నాగేశ్వరరావు ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఈ విషయం తెలుసుకున్న మువ్వా విజయ్‌బాబు చాపరాలపల్లిలోని నాగేశ్వరరావు నివాసానికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య చికిత్సకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ.. నాగేశ్వరరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జహీరుద్దీన్, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, నాయకులు నాగళ్ల వెంకటేశ్వరరావు, గాదె తిరుపతిరెడ్డి, నల్లమౌతు జగదీష్, పాలకుర్తి సుమిత్, సురభి రాజేష్, మాచినేని మునేశ్వరరావు, నున్నా జగదీష్, బాల అప్పారావు, బానోత్ జ్యోతి భగవాన్, తన్నీరు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన ఎస్పీ నరసింహ

## నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి



నల్గొండ, ఆగష్టు 27: రహదారులపై వాహనాలు బ్రేక్‌డౌన్ అయితే వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులకు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. పోలీసు స్టేషన్లు, పోలీసు కార్యాలయాల వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం కోదాడ డివిజన్ డీఎస్పీ కార్యాలయం, కోదాడ పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కవాతును పరిశీలించారు. ఆయా కార్యాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ప్రజల భద్రత కోసం అనుక్షణం కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సాపరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమర్థవంతమైన పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో డ్రంకన్ డ్రైవ్, అమలు రిజిస్టర్లను పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ రోప్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించారు.

యువత డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. డీఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిస్టర్లను ఎస్పీ పరిశీలించారు. వరకట్న హత్యలు, ఆత్మహత్యలు, తీవ్రమైన మోసాలు, అట్రాసిటీ కేసులు, మైనర్లపై వేధింపులకు సంబంధించిన కేసుల పురోగతిని సమీక్షించారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని డీఎస్పీకి సూచించారు.

సిబ్బంది పనితీరును మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని, సామాజిక, భద్రతా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలు, హోటళ్లు, టీ దుకాణాలు, ఇతర వ్యాపార నిర్వాహకులకు అవగాహన కల్పించి, వారి వద్ద తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలని ఆదేశించారు. వ్యాపార సంస్థలు, కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రత కోసం అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని, హైవే పెట్రోలింగ్ నిరంతరం నిర్వహించాలని తెలిపారు. రహదారులపై వాహనాలు అక్రమంగా నిలిపివేయకుండా అమలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. మునగాల, నడిగూడెం, చిలుకూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో యువతకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అత్యాశకు లోనై ఆన్‌లైన్ పెట్టుబడుల విషయంలో కొందం సైబర్ మోసగాళ్ల బారిన పడుతున్నారని, ప్రత్యేక చర్యల ద్వారా ఈ ప్రాంతంలో సైబర్ నేరాలను అదుపు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కోదాడ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐలు నవీన్, మోహన్, స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డీసీఆర్‌బీ సిబ్బంది అంజన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సీసీ సందీప్, టెక్నికల్ కానిస్టేబుల్ అబెద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నకాపర్తిలో ఎస్ఐఆర్‌పై గ్రామసభ.. ఓటర్లకు అవగాహన

నల్గొండ, ఆగష్టు 27: గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు, ఫొటో, ఇతర వివరాలను సరిచూసుకోవాలని చిన్నకాపర్తి గ్రామ సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్ సూచించారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో గురువారం సర్పంచ్ ఆవుల సుందరయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా, ఓటర్ల వివరాల సవరణ, కొత్తగా అర్హులైన ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, దావాలకు సంబంధించిన అంశాలపై గ్రామసభలో ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఆవుల సుందరయ్య మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరూ తమ పేరు, వయస్సు, చిరునామా, ఫొటో తదితర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తప్పులు, పొరపాట్లు ఉంటే సంబంధిత ఆధారాలతో సవరణ చేసుకోవాలని తెలిపారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

అర్హత ఉన్నప్పటికీ ఓటరు జాబితాలో పేరు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, అలాగే జాబితాలో వివరాల సవరణ అవసరమైన వారు నిర్ణీత ఫారాలు, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సర్పంచ్ సూచించారు. గత రికార్డులతో ఓటర్ల వివరాల అనుసంధానంలో తేడాలు ఉన్నవారు, ధ్రువీకరణ అవసరమైన వారు సంబంధిత ఆధారాలను అందించాలని తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ప్రజలు అధికారులకు సహకరించాలని సర్పంచ్ ఆవుల సుందరయ్య కోరారు. గ్రామసభలో ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, ఓటరు జాబితాపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కరవును పునరావృతమయ్యే విపత్తుగా కాకుండా.. ముందే గుర్తించదగిన, నివారించదగిన ముప్పుగా పరిగణించాలి: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:కరవు విషయంలో ప్రపంచ ధోరణిలో ప్రాథమిక మార్పు రావాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రతిస్పందన స్థాయి నుంచి క్రియాశీలకమైన, సాంకేతిక ఆధారితంగా కరవును తట్టుకొనే సామర్థ్యం దిశగా మారాలన్నారు. మంగోలియాలోని ఉలాన్‌బాతర్‌లో జరిగిన ఎడారీకరణ నిరోధక ఐక్యరాజ్యసమితి ఒప్పందం (యూఎన్‌సీసీడీ) 17వ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్ 17)లో "కరవును తట్టుకొనే సామర్థ్యాన్ని వేగవంతం చేయడం" అనే అంశంపై జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రి ప్రసంగించారు. కరవును "ఇకపై అప్పుడప్పుడూ వచ్చే విపత్తుగా కాకుండా అభివృద్ధికి ప్రధాన సవాలు"గా వర్ణించారు. ఇది నీటి భద్రతనూ, ఆహార వ్యవస్థలనూ, జీవ వైవిధ్యాన్నీ, ఆర్థిక స్థిరత్వాన్నీ ప్రభావితం చేస్తుందని మంత్రి అన్నారు.

ముందస్తు హెచ్చరికలు, ఉపశమనం, సహాయం, సామాజిక స్థిరత్వాన్ని ఏకీకృతం చేసేలా భారత్ అనుసరిస్తున్న సమన్వయ, బహుళ సంస్థాగత విధానం గురించి శ్రీ యాదవ్ వివరించారు. అంతర మంత్రిత్వశాఖలు, రాష్ట్ర స్థాయుల్లో వర్షపాత పర్యవేక్షణ, ఉపగ్రహ ఆధారిత కరవు అంచనాలు... ముందుగానే సన్నద్ధం చేస్తాయి. తద్వారా కరవును విపత్తుగా మారకుండా చూస్తాయి. భూమికీ, నీటికీ మధ్య ఉన్న సున్నితమైన సంబంధం గురించి మంత్రి వివరించారు. "ప్రవాహం ఆరంభానికి ముందే అడవులను పునరుద్ధరించాలి" అని అన్నారు. కోతను తగ్గించడానికీ, నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికీ, భూగర్భ జలాలను పునరుజ్జీవింపచేయడానికీ పరివాహక ప్రాంతం, నదీతీర ప్రాంతాల్లో అటవీ కరణపై భారతదేశం దృష్టి సారిస్తోందని చెప్పారు. నదుల పునరుజ్జీవనం, సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ కార్యక్రమాలు నీటి భద్రతను, గ్రామీణ ప్రాంతాల్లో కరవును తట్టుకొనే సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయి.

భారత్‌లోని కొండ ప్రాంతాల్లో సామాజిక భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న నీటి చెలమలు, రీఛార్జి జోన్ల పునరుద్ధరణ గురించి మంత్రి వివరించారు. అలాగే మైదాన ప్రాంతాల్లో సామాజిక సంస్థల మద్దతుతో, గ్రామీణ ఉపాధి కార్యక్రమాల సమన్వయంతో దేశవ్యాప్తంగా వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. దీనిలో రిడ్జ్‌టు వ్యాలీ విధానాన్ని అనుసరిస్తూ బీడుగా మారిన వర్షాధార భూములను బాగు చేస్తున్నామని చెప్పారు. స్పష్టమైన సేవా స్థాయులు, స్థానికంగా నిర్వహించే నాణ్యతా పరీక్షలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గృహస్థాయిలో అమలు చేస్తున్న తాగునీటి కార్యక్రమాలు సంక్షోభ సమయాల్లో సైతం విశ్వసనీయమైన సరఫరాను అందిస్తున్నాయి. పంట కాలంలో కరవుతో పాటు నివారించలేని ఇతర నష్టాల నుంచి రైతులను పంట బీమా రక్షిస్తుందని తెలియజేశారు. సబ్సిడీ ప్రీమియంలతో పాటు సాంకేతిక ఆధారిత అంచనా ద్వారా వేగంగా, పారదర్శకంగా బీమా పరిహారం చెల్లించే విధానం గురించి వివరించారు. క్రియాశీలకమైన, సాంకేతిక ఆధారిత స్థిరత్వానికి సామాజిక యాజమాన్యం, సామర్థ్య నిర్మాణం, జీవనోపాధి వైవిధ్యీకరణ కీలకమని మంత్రి స్పష్టం చేశారు.

"పునరావృతమయ్యే, అత్యవసర స్పందన అవసరమయ్యే విపత్తుగా కాకుండా, ముందుగానే గుర్తించదగిన, నివారించదగిన ముప్పుగా కరవును నిర్వహించాలి" అని భారత్ విశ్వసిస్తోందని శ్రీ యాదవ్ తెలిపారు. వాటర్‌షెడ్ అభివృద్ధి, నీటి సంరక్షణ, అడవుల పెంపకం, భూగర్భ జలాల పెంపు, వాతావరణ మార్పులను తట్టుకునే పంటల సాగు లాంటి నివారణ చర్యల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

వీటితో పాటు అవసరమైన సందర్భాల్లో విపత్తు నిధులు, ఉపాధి హామీ, పశుగ్రాసం సరఫరా, అత్యవసర తాగునీరు అందించడం లాంటి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని శ్రీ యాదవ్ పిలుపునిచ్చారు. పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణ, ముందస్తు హెచ్చరికల వ్యవస్థల బలోపేతం, సమన్వయంతో కూడిన కార్యాచరణ కోసం ఎక్కువ పెట్టుబడులు పెట్టాలని ఆయన సూచించారు. "ప్రతిస్పందనకు బదులు సన్నద్ధత, విపత్తు నిర్వహణకు బదులు నివారణ, పునరుద్ధరణకి బదులు కరవును తట్టుకొనే సామర్థ్యాన్ని పొందడమే లక్ష్యం కావాలి" అని అన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారికి కరువును తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం అనేది కేవలం ఒక ప్రత్యామ్నాయం కాదనీ, అది వారి జీవన్మరణ సమస్య అని స్పష్టం చేస్తూ తన ప్రసంగాన్ని ముగించారు. భవిష్యత్తులో కరవును అందరూ సమర్థవంతంగా ఎదుర్కొనేలా, ముందస్తు హెచ్చరికల వ్యవస్థతో సహా విజ్ఞానాన్ని, నైపుణ్యాలను ప్రపంచంతో పంచుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన ఉద్ఘాటించారు.

# భీమ్‌గల్ ఎస్సై-2గా పి. శంకర్ బాధ్యతల స్వీకరణ

## ఆదిలాబాద్ టూ టౌన్ నుంచి బదిలీపై భీమ్‌గల్‌కు రాక





నిజామాబాద్, ఆగష్టు 27: భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై-2గా పి. శంకర్ బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని రోజులుగా అదిలాబాద్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై భీమ్‌గల్‌కు వచ్చి నూతన బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై-2 పి. శంకర్ భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ నూతన ఎస్సైకి అభినందనలు తెలిపారు.

భీమ్‌గల్ పట్టణంతో పాటు మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలో రాకపోకల క్రమబద్ధీకరణ, రహదారి భద్రత, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, మహిళలు, వృద్ధుల భద్రత వంటి అంశాలపై పోలీసుల పర్యవేక్షణ కీలకంగా మారిందన్నారు.

నూతన ఎస్సై-2గా బాధ్యతలు స్వీకరించిన పి. శంకర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, చట్టపరమైన పరిధిలో సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

భీమ్‌గల్ పరిధిలో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా పోలీసు సేవలను మరింత ప్రజలకు చేరువ చేయడంతో పాటు, ప్రజలు?పోలీసుల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. నూతన ఎస్సై-2గా పి. శంకర్ బాధ్యతలు స్వీకరించడంతో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# మాతృమూర్తి మృతికి నివాళులు అర్పించిన టీపీసీసీ చీఫ్



నిజామాబాద్, ఆగష్టు 27:నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి మాతృమూర్తి మంగళవారం మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ గురువారం ఉదయం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. నగరంలోని 49వ డివిజన్ కసాబ్‌గల్లిలో ఉన్న మేయర్ కూరగాయల ఉమారాణి నివాసానికి చేరుకున్న మహేష్‌కుమార్ గౌడ్.. మేయర్ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

కష్టకాలంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఉమారాణికి, ఆమె కుటుంబ సభ్యులకు మహేష్‌కుమార్ గౌడ్ భరోసా కల్పించారు. మాతృమూర్తిని కోల్పోవడం తీరని లోటని అన్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

మహేష్‌కుమార్ గౌడ్ వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రముఖులు ఉన్నారు. వారు కూడా మేయర్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన మొరం టిప్పర్

కరీంనగర్, ఆగష్టు 27:వేములవాడ మారుపాక నంది కమాన్ వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. వెంట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును మొరం టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

టిప్పర్ ఢీకొట్టడంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే అదృష్టవశాత్తూ పెను ప్రమాదం తప్పింది. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారికి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. టిప్పర్ అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

# నానో యూరియా, డీఏపీతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

## ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులు పకడ్బందీగా నమోదు చేయాలి

మహబూబ్‌నగర్, ఆగష్టు 27:రైతులు పత్తి పంట సాగులో నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని నారాయణపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ అన్నారు. గురువారం ఊట్కూర్ మండల పరిధిలోని కొల్లూరు, ఊట్కూర్ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, విక్రయాల వివరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా సక్రియ నాయక్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా డీలర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎరువుల విక్రయాల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నిల్వల రిజిస్టర్లు, విక్రయ రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు బిల్లులు అందజేస్తూ పారదర్శకంగా ఎరువుల విక్రయాలు చేపట్టాలని తెలిపారు.

పత్తి పంటకు అవసరమైన ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగంతో ఎరువుల ఖర్చును కొంత మేర తగ్గించుకోవచ్చని తెలిపారు. ఎరువుల వినియోగం, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

# మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మృతికి నివాళులు..



కామారెడ్డి, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): భిక్కనూర్ మండలం భాగీర్తిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పల్లెర్ల శ్రీనివాస్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తనయుడు మహమ్మద్ ఇలియాస్ గ్రామానికి చేరుకుని శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీకి శ్రీనివాస్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగన్నగారి నరేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, గ్రామ సర్పంచ్ గంగయ్యగారి నర్సింలు, ఉప సర్పంచ్ వడ్ల స్వామి పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగి బాగయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దపొట్టి సుధాకర్, రేషన్ డీలర్ గోండ్ర అశోక్, యూత్ అధ్యక్షుడు చేపల కుమార్, ఉపాధ్యక్షుడు జంగం అరవింద్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లో ఉద్యోగుల ధర్నా

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 27: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, పదోన్నతులు కల్పించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. నూతన ఆరోగ్య పథకాన్ని అమలు చేయడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రెండో వేతన సవరణ సంఘాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నా కార్యక్రమంలో ఉద్యోగ, వైద్య, ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు.

# శాశ్వత భారతీయతకు శబ్దరూపం-సంస్కృతం


సంస్కృతం... శబ్ద సౌందర్యానికి శిఖర రూపం, జ్ఞానానికి మూల స్తంభం, భారతీయతకు జీవన రేఖ. వేదాల ప్రథమ స్పందనలతో ప్రారంభమై, యుగయుగాలుగా ఆధ్యాత్మికత, విజ్ఞానశాస్త్రం, సాహిత్యం, నాట్యం, సంగీతం, తత్వ విచారణ వంటి అన్ని విభాగాలలోనూ వెలుగులు నింపిన భాష. ఇది ఒక మృదుమధురమైన భాష మాత్రమే కాదు ? భారతీయ మనోభావాలకు రూపం ఇచ్చిన ఆధ్యాత్మిక ప్రతిధ్వని. అలాంటి సంస్కృత భాషకు అంకితంగా ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి నాడు జరుపుకునే ప్రపంచ సంస్కృత దినోత్సవం, భాషకే గాక భారతీయతకు అంకురార్పణ వంటిది.

ఈ దినోత్సవాన్ని శ్రావణ పూర్ణిమ నాడు జరుపుకోవడం అనేది యాదృచ్ఛికం కాదు. ఉపాకర్మ అనే వేద సాంప్రదాయ పునరుద్ధరణ, ఋషి తర్పణం వంటి కార్యాలతో ఈ రోజుకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యత అనంతం. శ్రావణ మాసం భారత కాలచక్రంలో శుభానుకూలమైనది. ఈ రోజునే వేద విద్యారంభ దినంగా, సంస్కృతాధ్యయనానికి ప్రారంభముగా పరిగణిస్తారు. ఇది మన సంస్కృతి యొక్క ఆంతర్యాన్ని, భాషాపరంగా భక్తి, విజ్ఞానం, సంస్కారం బలపడే శుభసంధిగా నిలుస్తుంది.

సంస్కృతం... గాంభీర్యాన్ని, శుద్ధతను, విన్యాస సౌందర్యాన్ని మేళవించుకున్న భాష. దీనిలోని ప్రతి అక్షరం ధ్వనియోగం పరంగా శక్తిసంపన్నమైనదిగా భావించ బడుతుంది. పాణినీ రచించిన వ్యాకరణం, పద నిర్మాణ రీతులు, సమాస వ్యవస్థలు, ధాతుల అన్వయ ప్రయోగాలు... ఇవన్నీ భాషా నిర్మాణంలోనూ, భావ ప్రకటనలోనూ అమోఘంగా పనిచేస్తాయి. 'ఒక పదానికి పదహారు ప్రయోగాలు', 'ఒక శ్లోకానికి నాలుగు అర్థాలు', 'ఒక పదబంధానికి శబ్ద?సంగీత సామరస్యాన్ని' కలిపే సామర్థ్యం ? ఇవి సంస్కృత భాషకు మాత్రమే ప్రత్యేకతలు.

భారతీయ విజ్ఞాన సంపద మొత్తం సంస్కృత భాషలోనే వికసించింది. వేదాల నుండి ఉపనిషత్తుల దాకా, అష్టాదశ పురాణాల నుండి ఇతిహాసాల దాకా, భారతీయ వైద్యశాస్త్రం (ఆయుర్వేదం), గణితం (ఆర్యభటీయం), ఖగోళం (సూర్యసిద్ధాంతం), నాట్య శాస్త్రం (నాట్యశాస్త్రం), వాస్తుశాస్త్రం, ధర్మశాస్త్రాలు.. అన్నీ సంస్కృత భాషలోనే అభివృద్ధి చెందాయి. వచనాల రూపంలో కాక, మంత్ర ధ్వనులుగా ఈ విజ్ఞానం తరతరాలకు సంక్రమించింది.

కాళిదాసుడి నుండి భవభూతి, బాణ భట్టుడు, మేఘదూతం నుండి రఘువంశం వరకు సంస్కృత సాహిత్యం భావాల పరిపక్వతకు, పదాల పరిమళానికి, శబ్దాల గంభీరతకు ఉదాహరణగా నిలుస్తుంది. శృంగార రసమో, వీర రసమో, విరహ తాపమో ? ప్రతీ భావాన్ని సంస్కృతం అద్భుతంగా మలచ గలదు. ఈ భాషలో నాటక రచనల వైభవం, శిల్ప కళలపై




శాస్త్రీయ రచనలు, సంగీత సూత్రాలు ? అన్నీ భవిష్యత్ ప్రపంచానికి భారత జ్ఞాన సమృద్ధిని గుర్తించించే మార్గదర్శకాలు.

అందరూ ఊహించినట్లు ఇది కేవలం ఒక "మృత భాష" కాదు. అమృత భాష, అమర భాష. ప్రస్తుత శతాబ్దంలో కంప్యూటర్ టెక్నాలజీ, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యానలిటికల్ లాజిక్ వంటి రంగాల్లో సంస్కృతం అత్యంత ఖచ్చితమైన భాషగా గుర్తించబడింది. ఔియాం వాడే NASA వాడే Natural Language Processing algorithm లో సంస్కృతం ప్రయోగానికి అనుకూలమైన భాషగా గుర్తింపు పొందినది. సంస్కృతంలోని వ్యాకరణ పద్ధతులు కంప్యూటర్ లాంగ్వేజ్ డిజైన్‌లోను, డేటా స్ట్రక్చర్స్ రూపకల్పనలోను ప్రేరణగా మారాయి.

ప్రపంచ వ్యాప్తంగా సంస్కృత భాషపై తిరిగి మక్కువ పెరుగుతోంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, ఆస్ట్రేలియా దేశాలలో ఉన్న విశ్వ విద్యాలయాల్లో సంస్కృతాన్ని ప్రాథమిక స్థాయి నుండి పరిశోధన స్థాయి వరకు బోధిస్తున్నారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి విశ్వ విద్యాలయాల్లో పీఠాలు ఉన్నాయి. బోస్టన్ నుండి బెర్లిన్ వరకూ, టోక్యో నుండి మెల్‌బోర్న్ దాకా అన్ని దేశాల్లో సంస్కృతానికి గౌరవం పెరుగుతోంది. జర్మనీలో పాఠశాల స్థాయిలో ఐచ్ఛిక భాషగా బోధించటం విశేషం.

మన దేశంలోనూ భారతీయ సంస్కృత సంస్థలు, కేంద్ర/రాష్ట్ర సంస్కృత విశ్వ విద్యాలయాలు, అకాడెమీలు, ట్రస్ట్‌లు సంస్కృత భాష అభివృద్ధికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. 'సంస్కృత టీవీ', 'సంస్కృత రేడియో', 'సంస్కృత న్యూస్', 'సంస్కృత నాటకోత్సవాలు', 'సంస్కృత పత్రికలు' వంటి పలు వేదికల ద్వారా భాష ప్రజల నిత్య జీవితానికి చేరువవుతోంది. ప్రస్తుతం న్యాయపరంగా కూడా కొన్ని రాష్ట్రాలు సంస్కృతాన్ని రెండో అధికార భాషగా ప్రకటించాయి.

ఈ భాష, మానవ వికాసానికి ఒక మార్గదర్శకం. చిన్నతనం నుండే సంస్కృత విద్య అందితే, పిల్లలలో పద సంయోజన సామర్థ్యం, తాత్త్విక దృష్టి, లాజికల్ ఆలోచన వికసిస్తుంది. సంస్కృత శిక్షణ వల్ల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటు కలుగుతుంది. భావ శుద్ధి, శబ్ద సంయమనం, సమ చింతన ఇవన్నీ పెరుగుతాయి. ఇది హృదయ నిర్మాణాన్ని భద్రపరచే విద్య.

ఇలాంటి భాషను మనం ఆచరణలోకి తేవాలి. ఇంట్లో పూజా పాఠాలలోనూ, పాఠశాలలో ఆచరణాత్మకంగా పాఠ్యంగా, కళాశాలల్లో పరిశోధనల స్థాయిలో, సాహిత్య సభల్లో ఉద్ఘాటన స్థాయిలో ? అన్ని రంగాలలో సంస్కృత భాషను చైతన్యవంతంగా మార్చాలి. ఇది భవిష్యపు తరం సంస్కారం కోసం మనం చేసే సేవగా మారాలి.

వేద ధ్వని నుండి మానవతా ధర్మం దాకా, భౌతిక శాస్త్రం నుండి తత్త్వశాస్త్రం దాకా, సంస్కృతం శాశ్వత జ్ఞానానికే ప్రతీక. ఇది గర్వించదగ్గ వారసత్వం. ఈ భాషను కేవలం గత జ్ఞాపకంగా కాక, భవిష్యత్తు సాధనగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ దినోత్సవం, మనం సంస్కృతాన్ని మళ్లీ మన సంస్కృతిలోనికి చేర్చుకోవాలని, నిత్య జీవన భాగంగా మార్చుకోవాలని సంకల్పించే సందర్భంగా మారాలి.

జయతు సంస్కృతం×జయతు భారతం!



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# దేశవ్యాప్తంగా సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా వ్యాప్తి ధోరణులను నిశితంగా పర్యవేక్షిస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 27:ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ)లతో సమన్వయం ద్వారా... ఒక పటిష్ఠమైన దేశవ్యాప్త నిఘా నెట్‌వర్క్ సహాయంతో దేశంలో విస్తరిస్తున్న సీజనల్ శ్వాసకోశ వ్యాధుల వ్యాప్తి ధోరణిని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ (ఎంవోహెచ్ఎఫ్‌డబ్ల్యూ) నిశితంగా పర్యవేక్షిస్తోంది.

ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్) కార్యదర్శి, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుత ఇన్‌ఫ్లూయెంజా వ్యాప్తి తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన, ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం వ్యాపిస్తున్న ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు... ఇటీవలి సంవత్సరాల్లో గమనించిన సీజనల్ నమూనాకు అనుగుణంగానే ఉన్నాయన్నారు.

73 డీహెచ్ఆర్-ఐసీఎంఆర్ వైరస్ పరిశోధన-నిర్ధారణ ప్రయోగశాలల నెట్‌వర్క్ ద్వారా కొనసాగుతున్న జన్యు సంబంధిత, వ్యాధి వ్యాప్తి సంబంధిత పర్యవేక్షణ ముఖ్యమైన భరోసాను అందించింది.

2025 నుంచి ఈ వైరస్ రకం దేశంలో నిరంతర వ్యాప్తిలో ఉందని డాక్టర్ బహల్ తెలిపారు. గమనించిన జన్యుపరమైన మార్పులు, సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లలో కనిపించే సాధారణ యాంటిజెనిక్ డ్రిఫ్ట్‌కు అనుగుణంగానే ఉన్నాయి. ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నప్పుడు ఇటువంటి చిన్న జన్యుపరమైన మార్పులు సాధారణంగా జరుగుతాయి. అవి స్వయంగా ఒక కొత్త లేదా ప్రమాదకరమైన రకం వైరస్ ఆవిర్భావానికి సూచన కాదు అని ఆయన వివరించారు.

అందువల్ల ప్రస్తుత పరిశీలనలు కొత్త ఇన్‌ఫ్లూయెంజా ముప్పు తలెత్తడాన్ని సూచించడం లేదనీ, ఇవి అంచనా వేసిన సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌ల ప్రవర్తనకు అనుగుణంగానే ఉన్నాయని డాక్టర్ బహల్ స్పష్టం చేశారు.

ఇన్‌ఫ్లూయెంజా ం (హెచ్1ఎన్1) సహా సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా కారణంగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తుల్లో ప్రధానంగా తేలికపాటి, వాటంతట అవే తగ్గిపోయే సాధారణ శ్వాసకోశ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. దీని సాధారణ లక్షణాలు: జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, అలసట, నీరసం. చాలా మందిలో సహాయక సంరక్షణ, తగినంత విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవడం ద్వారానే లక్షణాలు మెరుగు పడతాయి. కేవలం హెచ్1ఎన్1 ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తికి తీవ్రమైన అనారోగ్యం కలుగుతుందనీ, ఆసుపత్రిలో చేరాల్సి వస్తుందనీ అర్థం కాదు. సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా సాధారణంగా తేలికపాటిదే అయినప్పటికీ, కొంతమందిలో అనారోగ్య సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని డాక్టర్ బహల్ తెలిపారు. వృద్ధులు, చిన్నపిల్లలు, ఇతర అనారోగ్య సమస్యలు లేదా అనుబంధ-వ్యాధులు ఉన్నవారు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారిలో సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. అటువంటి వ్యక్తులు మరింత జాగ్రత్త వహించాలనీ, వారికి ఇన్‌ఫ్లూయెంజా వంటి లక్షణాలు కనిపిస్తే సకాలంలో వైద్య సలహా తీసుకోవాలనీ ఆయన సూచించారు.

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, డీహెచ్ఆర్, ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీలు దేశవ్యాప్తంగా ఇన్‌ఫ్లూయెంజా వ్యాప్తి ధోరణులను పర్యవేక్షించడానికి నిరంతర ఎపిడెమియోలాజికల్, వైరలాజికల్, జెనోమిక్ నిఘాను నిర్వహిస్తున్నాయి. విస్తృతమైన వీఆర్‌డీఎల్ నెట్‌వర్క్... వ్యాప్తిలో ఉన్న శ్వాసకోశ వైరస్‌లను సకాలంలో గుర్తించడానికి, వాటి లక్షణాలను నిర్ధారించడానికి వీలు కల్పిస్తుంది. కొత్తగా తలెత్తే ఏవైనా ధోరణులకు ప్రజారోగ్య అధికారులు తగిన విధంగా స్పందించడానికీ ఇది సహాయపడుతుంది.

ఇన్‌ఫ్లూయెంజా కార్యకలాపాలు, వ్యాప్తిలో ఉన్న రకాలు, వ్యాధి తీవ్రతలో మార్పులను ఈ నిఘా యంత్రాంగం నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉంటుంది. ప్రస్తుతం లభించిన ఆధారాలు... హెచ్1ఎన్1 ఇన్‌ఫ్లూయెంజా ప్రవర్తనలో ఏదైనా అసాధారణ మార్పును గానీ, కొత్త రకం వైరస్ ఆవిర్భావాన్ని గానీ సూచించడం లేదు.

ప్రజలంతా దీని గురించి తగిన సమాచారం తెలుసుకొంటూ అప్రమత్తంగా ఉండాలి. భయపడే అవసరం లేదు. సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా మనకు సుపరిచితమైన, నిత్యం పర్యవేక్షించే సాధారణ శ్వాసకోశ సంబంధిత అంటు వ్యాధి. సాధారణ నివారణ చర్యలను పాటించడం, అవసరమైనప్పుడు సకాలంలో వైద్యుడిని సంప్రదించడం, అనవసరమైన మందులను వాడకుండా ఉండటం వంటివి వ్యక్తులను, సమాజాన్ని కాపాడటంలో సహాయపడతాయి.

# మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి: హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగష్టు 27: రాష్ట్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉపాధ్యాయుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. టీచర్ల సంఘం నాయకులు, మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు తనను కలిసి తమ సమస్యలను వివరించారని ఆయన తెలిపారు.

గత 32 నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదని బాధిత కుటుంబాలు వాపోయినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.

### 40 కుటుంబాలు ఇబ్బందుల్లో..

2004 తర్వాత సీపీఎస్ విధానంలో నియమితులై మరణించిన సుమారు 40 మంది మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ జీవోలు 60, 58 ప్రకారం డెత్ గ్రాట్యుటీ, కుటుంబ పింఛన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ, వాటి అమలులో సమస్యలు ఉన్నాయని ఆరోపించారు.

మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు మానవతా దృక్పథంతో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డెత్ గ్రాట్యుటీ, కుటుంబ పింఛన్ సౌకర్యాలను రాష్ట్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ పూర్తిస్థాయిలో వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

### ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్న హరీశ్‌రావు

రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న సుమారు 3 వేల మంది ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ బకాయిల చెల్లింపు కోసం విద్యాశాఖ కోరిన రూ.93 కోట్ల అదనపు బడ్జెట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలపలేదని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ డీఏల కారణంగా ఒక్కో ప్రిన్సిపాల్‌కు రూ.3.52 లక్షలు, పీజీటీకి రూ.2.81 లక్షలు, టీజీటీకి రూ.2.36 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. ఈ మొత్తాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఉద్యోగ, ఆర్థిక భద్రతతో పాటు ఆరోగ్య భద్రత కూడా కల్పించాలని హరీశ్‌రావు కోరారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని వెంటనే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే మోడల్ స్కూళ్లను '010' పద్దు కిందకు తీసుకువచ్చి ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

"టీచర్లు పాఠాలు చెప్పాల్సింది పోయి తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రావడం బాధాకరం" అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు పెండింగ్ డీఏలు, డెత్ గ్రాట్యుటీ, కుటుంబ పింఛన్ సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. అవసరమైతే అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని లేవనెత్తుతామని స్పష్టం చేశారు.

# చౌక్ బాల్ ఛాంపియన్‌కు ఘన సన్మానం



వరంగల్, ఆగష్టు 27:మలేషియాలో జరిగిన అంతర్జాతీయ చౌక్ బాల్ క్రీడా పోటీల్లో రాణించిన హసకొత్తూరు గ్రామానికి చెందిన చౌక్ బాల్ ఛాంపియన్ చిర్లంచ శశ్వంత్‌ను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పూలమాల, శాలువాతో శశ్వంత్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. ఇటీవల ఏపీటీవైసీ-2026లో భాగంగా మలేషియాలో నిర్వహించిన చౌక్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో హసకొత్తూరు గ్రామానికి చెందిన చిర్లంచ వేణు, జ్యోతి దంపతుల కుమారుడు శశ్వంత్ అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నలిమేల రేవతి గంగారెడ్డి మాట్లాడుతూ శశ్వంత్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చే యువతను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని సర్పంచ్ అన్నారు. రాబోయే రోజుల్లో శశ్వంత్ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్, వార్డు సభ్యులు కల్లెడ రాణి, కల్లెడ కాశావ్వ, మాజీ ఎంపీటీసీ తెడ్డు రాజన్న, జంగం మహేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడ్ల శ్రీకాంత్, నాయకులు దేవయి రాజేశ్వర్, శ్రీనివాస్, ఉట్నూర్ నరేష్, గోపి పాల్గొన్నారు.

# రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ

## పంటల నమోదు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

వరంగల్, ఆగష్టు 27:భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లి రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, యాప్‌ల వినియోగం, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితుల్లో పంటల సాగు, ప్రస్తుత పంటల్లో చేపట్టాల్సిన ఆచరణాత్మక పద్ధతులపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కళ్యాణి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు రకాల ప్రాథమిక లక్షణాలు కలిగిన సన్న రకం వరి సాగు చేస్తున్న రైతులు బోనస్ పొందేందుకు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు, అలాగే సొంత విత్తనాలను వినియోగిస్తున్న రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి రైతు డిక్లరేషన్ సమర్పించి నమోదు చేసుకోవాలని తెలిపారు.

2026 వానాకాలం పంటల నమోదుకు సెప్టెంబర్ 10, 2026 చివరి తేదీ అని కళ్యాణి పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన సర్వేయర్లు గ్రామానికి వచ్చి ఆన్‌లైన్ పంట నమోదు చేపట్టే సమయంలో రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

పంటల నమోదు వివరాల ఆధారంగానే ప్రభుత్వం పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని తెలిపారు. నూతన ఎరువుల బుకింగ్ యాప్‌ల వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని వ్యవసాయానికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు.

# ప్రతి ఓటరు బాధ్యతగా జాబితాలో తనిఖీ చేసుకోవాలి

## నోటీసులు అందుకున్న వారు ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలి

వరంగల్, ఆగష్టు 27: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉన్న ఓటరు జాబితాలను ప్రతి ఓటరు బాధ్యతగా పరిశీలించుకోవాలని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకుని, అవసరమైతే తగిన దరఖాస్తులను ధ్రువీకరణ పత్రాలతో సమర్పించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లి నమోదు పత్రాలను అందజేయగా, వాటి ఆధారంగా స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటరీకరించారు. అనంతరం ఓటర్ల వివరాలతో కూడిన జాబితాలను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ మాట్లాడుతూ.. నో మ్యాపింగ్ ప్రక్రియలో ఉన్న పేర్లకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. ముద్రణ, కంప్యూటరీకరణలో జరిగిన చిన్నచిన్న తప్పిదాలను ఓటర్లు పరిశీలించుకుని సరిచేయించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఏవైనా తపలు, అనామలీలు ఉంటే వాటిని గుర్తించి సరిచేయించుకునే బాధ్యత ఓటర్లదేనని స్పష్టం చేశారు. ప్రదర్శించిన జాబితాలో మరణించిన వారి పేర్లు, నివాసం మారిన వారి పేర్లు, రెండుసార్లు నమోదైన పేర్లను తొలగించినట్లు కమిషనర్ తెలిపారు. ఇంకా ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత దరఖాస్తు పత్రాలను నింపి అధికారులకు అందజేయాలని సూచించారు.

నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలని తెలిపారు. సంబంధిత పత్రాలను అక్టోబర్ 15వ తేదీలోపు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 1987కు ముందు జన్మించిన వారు 2002 ఓటరు జాబితాలో ఉండే అవకాశం ఉందని, 2002 నుంచి 2004 మధ్య జన్మించిన వారి పేర్లు 2002 జాబితాలో ఉండవని వివరించారు.

2000 నుంచి 2025 సంవత్సరాల మధ్య ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారు తమ తల్లిదండ్రుల్లో ఎవరి వివరాలనైనా ఆధారంగా చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో మూడు విధాలుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే బూత్ స్థాయి అధికారులను లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సమావేశాల్లో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు ఓటర్లకు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, ఓటర్లు పాల్గొన్నారు.

# ఐదో రోజుకు చేరిన నిరాహార దీక్ష

ఆదిలాబాద్, ఆగష్టు 27: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టైగర్ జోన్‌ను రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల కన్వీనర్ శ్రీరాములు భూమాచారి స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి రెండో రోజుకు చేరాయి. దీక్ష శిబిరాన్ని మండలంలోని లింగయ్యపల్లి నేతలు సందర్శించి మద్దతు తెలిపారు. కొత్తపెల్లి శ్రీనివాస్, పిండి నరేష్, జక్కుల కొమురయ్య, ఎన్. గంగాధర్, ఉడుతల రవి, బి. రమేష్, గడ్డి విష్ణు, శ్రీరాముల సత్యనారాయణ తదితరులు దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు దీక్షకు సంఘీభావం తెలిపారు. టైగర్ జోన్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని టైగర్ జోన్, ఎకో సెన్సిటివ్ జోన్ అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

# ఎమ్మెల్యేకు రాఖీ మహిళా సర్పంచులు

హన్మకొండ, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి) భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు గురువారం పలువురు మహిళా సర్పంచులు రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

గట్లకానిపర్తి సర్పంచ్ వైనాల విజయ, శాయంపేట సర్పంచ్ చింతల ఉమా, పెద్దకొడపాక సర్పంచ్ మంద దీనతో పాటు పలువురు మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధానికి, ఆత్మీయతకు రాఖీ పండుగ నిదర్శనమని అన్నారు.

రక్షాబంధన్ సందర్భంగా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# పవిత్ర ప్రేమకు ప్రతీక "రక్షాబంధన్"

## పండుగ ప్రస్తావన :

భారతీయ పండుగలలలో, శ్రావణ మాసం "పౌర్ణమి" రోజున జరుపుకునే ఈ పండుగను "రక్షాబంధన్", "రాఖీ పండుగ", "రాఖీ పౌర్ణమి" జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. అక్కా చెల్లెలు లేదా అన్న లేదా తమ్ముడి మణికట్టుకు రంగుల అలంకరణలతో రాముడు, కృష్ణుడు ఇలా అనేక హిందూ దేవతామూర్తులను అమర్చి కట్టే చిన్న దారం ప్రేమ, నమ్మకం, బాధ్యత, రక్షణ, కుటుంబస్మృతి అన్నీ కలిసివుంటాయి. అందుకే రాఖీ ఒక అలంకార ప్రాయమైన దారం కాదు. సోదరి సోదరరుల ప్రేమకు ఇచ్చే ఆప్యాయతలు, పవిత్ర హామీ హృదయానికి హత్తుకునే పండుగ "రాఖీ పౌర్ణమి". రాఖీ పౌర్ణమి రోజున ఉదయం ఇల్లు శుభ్రం చేసి పూజాస్థలాన్ని అలంకరించడం, దేవుడికి పూజ చేయడం, కుటుంబ సభ్యులంతా కలిసి ఉండటం ప్రతి ఇళ్లలో కనిపించే సంప్రదాయం. సోదరునకు కట్టే రాఖీ, దీపం, కుంకుమ, అక్షింతలు, మిఠాయిలను అలంకరించడంతో పండుగకు ప్రత్యేక శోభనిస్తుంది. ఈ రోజుల్లో నగరాల జీవనశైలి కారణంగా అన్నాచెల్లెళ్లు వేర్వేరు నగరాలు, దేశాల్లో ఉండటం సాధారణమైంది. అయినా పోస్టు, కొరియర్, వీడియో కాల్, డిజిటల్ గిఫ్ట్‌ల ద్వారా ఆ ప్రేమ, అనుబంధం చేరుతూ, పండుగను సజీవంగా ఉంచుతుంది. ఈ పండుగ రక్త సంబంధీకులైన తోబుట్టువుల బంధాలకు అతీతంగా కూడా కృష్ణుడు మరియు ద్రౌపది, లక్ష్మి మరియు బలి చక్రవర్తి కథలతో సహా అనేక గాథలు, రాఖీ రక్త సంబంధం లేని వ్యక్తుల మధ్య రక్షణ, ఆప్యాయత మరియు పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలియపరుస్తుంటాయి. ఆధునిక వేడుకలలో తరచుగా కజిన్స్, స్నేహితులు మరియు ఇతర ముఖ్యమైన సంబంధాలు కూడా భాగమవ ుతాయి. చరిత్రలో రాఖీ ఐక్యతకు కూడా ప్రతీకగా రాఖీకి సంబంధించిన కొన్ని పురాణ చారిత్రక గాథలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయంటారు.

## చరిత్ర :

రాఖీ ఆవిర్భావానికి సంబంధించిన అత్యంత ప్రాచుర్యం పొందిన పురాణ గాథ అనేకం ఉన్నప్పటికీ పురాణ గాథలలో అత్యంత ప్రసిద్ధి పొందినది శ్రీకృష్ణుడు మరియు ద్రౌపదిల కథ. వారి బంధం, ఒక చిన్న కరుణా భావం, రక్షణ వాగ్దానాన్ని నిరూపిస్తుంది, అందుకే ఇది ఈ పండుగకు సంబంధించిన అత్యంత ఆదరణ పొందిన కథలలో ఒకటిగా నిలిచింది.

## రక్షాబంధన్‌లో కృష్ణుడు మరియు ద్రౌపది కథ యొక్క ప్రాముఖ్యత :

ఒక రాజసభలో శ్రీకృష్ణుడు పదునైన వస్తువును ఉపయోగిస్తున్నప్పుడు లేదా శత్రువుతో పోరాడుతున్నప్పుడు తన వేలును కోసుకోవడంతో, అక్కడున్నవారు మందుల కోసం పరుగెత్తుతుండగా, ద్రౌపది వెంటనే తన ఖరీదైన పట్టు చీర నుండి ఒక పట్టీని తీసి రక్తస్రావాన్ని ఆపడానికి కృష్ణుని వేలికి కట్టిందని, ఆమె తక్షణ చర్యకు, ప్రేమకు చలించిపోయిన కృష్ణుడు, ఆమె కష్టాల్లో ఉ న్నప్పుడల్లా రక్షిస్తానని వాగ్దానం చేశాడు. కౌరవుల రాజసభలో ద్రౌపదిని బహిరంగంగా అవమానిస్తున్నప్పుడు. వస్త్రాపహరణం చేస్తూ, ఆమె వస్త్రాన్ని లాగడానికి ప్రయత్నించినప్పుడు, కృష్ణుడు తన దివ్య శక్తులను ఉపయోగించి ఆమె చీరను అనంతంగా సాగేలా చేశాడు. ఆ ఆప్యాయతకు ప్రతిగా ఆమె గౌరవాన్ని కాపాడే బాధ్యతను కృష్ణుడు తన హృదయంలో స్వీకరించాడని కథనం చెబుతుంది. "సంబంధం రక్తంతోనే కాదు, మనసుతోనూ ఏర్పడుతుంది" అనే గొప్ప భావాన్ని ఈ గాథ అందిస్తుంది.

## బలి చక్రవర్తి మరియు లక్ష్మీదేవి:

ఇంకొక పురాణ గాధ బలి చక్రవర్తి మరియు లక్ష్మీదేవి గాథ, బలి చక్రవర్తి మూడు లోకాలను జయించిన తరువాత, రాజు యొక్క భక్తికి ప్రతిఫలంగా విష్ణుమూర్తిని పాతాళలోకంలో తనకు ద్వారపాలకుడిని చేయడంతో విష్ణువు భార్య లక్ష్మీదేవి తన భర్తను తిరిగి పొందడానికి, లక్ష్మి ఒక పేద స్త్రీ వేషంలో బలి చక్రవర్తి వద్దకు వెళ్ళింది. ఆమె బలిచక్రవర్తి మణికట్టుకు దారం కట్టి, భర్త క్షేమం కోసం ప్రార్థించింది. బలి చక్రవర్తి ఆమెను కానుకగా ఏమి కావాలో అడగ్గా, ఆమె తన నిజ స్వరూపాన్ని వెల్లడించి, విష్ణుమూర్తిని తిరిగి పంపమని కోరింది. మాట మీద నిలబడేవాడైన బలి చక్రవర్తి, ఆ దారపు బంధాన్ని గౌరవించి విష్ణువును విడిచిపెట్టాడు. అప్పటి నుండి, రక్షణకు రాఖీ కట్టుకోవడం ఒక సంప్రదాయంగా మారిందని పురాణ ప్రతీతి.

## శ్రావణ మాస పౌర్ణమి ప్రత్యేకత :

శ్రావణ పూర్ణిమను జంధ్యాల పూర్ణిమ అని కూడా అంటారు. యజ్ఞోపవీతాన్నే జంధ్యమని, బ్రహ్మసూత్రమని పిలుస్తారు. శ్రావణ పౌర్ణమి నాడు ఉపాకర్మ ప్రత్యేకమైన విధి. ఇది వేదాధ్యయానికి సంబంధించినది. జంధ్యాల పూర్ణిమ భారతావని మొత్తం శ్రావణ మాసంలో ఎంతో పవిత్రంగా భావించే రోజు. ఏడాదికి వచ్చే ద్వాదశ పూర్ణిమల్లోనూ శ్రావణ పూర్ణిమకు చాలా విశిష్టత వుంది. పాల్కురికి సోమన ఈ పూర్ణిమని 'నూలి పున్నమి' అన్నాడు. నూలుతో తయారు చేసిన



జంధ్యాలు ధరించడమే దీనికి కారణం. యజ్ఞోపవీతం ధరించేవారంతా ఈ రోజున నూతన యజ్ఞోపవీత ధారణ చేసి, జప, అర్చనాదులను నిర్వహిస్తుంటారు. యజ్ఞోపవీతము అంటే యాగకర్మ చేత పునీతమైన దారము అని అర్థము. యజ్ఞోపవీతం సాక్షాత్తూ గాయత్రీదేవికి ప్రతీక. పరమ పవిత్రమైన యజ్ఞోపవీత ధారణవల్ల జ్ఞానాభివృద్ధి కలుగుతుందని, యజ్ఞం ఆచరించిన ఫలితం కలుగుతుందని వేదోక్తి. మహర్షులు మనకు విధించిన పదహారు సంస్కారాలలో ఉపనయనం ఒకటి. సంస్కారాలన్నింటిలో ఇది అత్యంత ప్రాముఖ్యమైనది. ఉపనయనం ద్వారా గురువు తన శిష్యునికి ప్రతిభా పాటవాలను, జ్ఞానాన్ని ఉ పదేశిస్తాడు. ఉపనయన సంస్కారం పొందినవారిని 'ద్విజులు' అని అంటారు. ద్విజులు అనగా రెండు జన్మలు కలవారు. తల్లి కడుపు నుంచి జన్మించడం మొదటిది కాగా, ఉపనయనం చేసిన అనంతరం 'జ్ఞానాధ్యయనం' గురువు నుంచి నేర్చుకోవడం రెండో జననంగా చెప్పబడుతుంది. ఉపనయనం చేసిన సందర్భంలో యజ్ఞోపవీతానికి జింక చర్మం కడతారు. దీనిని ఈ ఉపాకర్మ కార్యక్రమంలో శ్రావణ పౌర్ణమి నాడు తీసి వేస్తారు. ఉపనయనం అయిన వారు ఈ రోజు గాయత్రీ పూజ చేసి కొత్త యజ్ఞోపవీతాన్ని ధరించి పాతదానిని విసర్జించాలి. ఈ 'జంధ్యాల పూర్ణిమ' కేవలం ఉపనయన సంస్కారం ఉన్న వారికే పరిమితమైనప్పటికీ మిగతా వారు కూడా ఈ రోజు అష్టోత్తరాలతో యాధాశక్తి గాయత్రీ దేవిని పూజిస్తే సకల శుభాలు తథ్యం. పవిత్రత, కొత్త సంకల్పం, పరస్పర శుభాకాంక్షల చుట్టూనే తిరుగుతుంది. అన్నాచెల్లెళ్ల లేదా అక్కాతమ్ముళ్ల బంధం చాలా ప్రత్యేకమైనది. చిన్నప్పుడు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటు, బొమ్మల కోసం, చాక్లెట్ల కోసం గొడవపడతారు; మళ్లీ కొద్దిసేపటికే కలిసి ఆడుకుంటారు. కాలం గడిచేకొద్దీ అదే బంధం గాఢమైన స్నేహంగా మారుతుంది. ఇంటి పరిస్థితులు, తల్లిదండ్రుల ఆరోగ్యం, చదువు, ఉ ద్యోగం, వివాహం, కష్టసుఖాలు సోదరులు ముందుంటారు. రాఖీ పండుగ ఆ మమకారాన్ని ఒక్కరోజు మాత్రమే కాదు రాఖీ అంటే కేవలం దారం కాదు

అక్క లేదా చెల్లెలు సోదరుని నుదుటిపై కుంకుమ పెట్టి మణికట్టుకు రాఖీ కట్టి, మిఠాయి తినిపిస్తుంది. దీపం వెలిగించి అక్క లేదా చెల్లెలు సోదరుడికి హారతి ఇస్తుంది. అన్న లేదా తమ్ముడు సోదరికి బహుమతిని అందిస్తాడు. ఈ సంప్రదాయంలో ప్రత్యేకత బహుమతిలో కాదు, "నీ సంతోషం నాకు ముఖ్యం అవసరమైనప్పుడు అండగా ఉంటానని సోదరుడు ఇచ్చిన భరోసాలో గొప్ప భావం ఉంది. చిన్ననాటి గొడవల నుంచి జీవితంలోని పెద్ద నిర్ణయాల వరకు తోడు నిలిచే ఒక చిన్న పసుపు దారంలో సోదరులకు సోదరి పట్లగల భాద్యత, ప్రేమ అనుబంధాలను బంధించే అందమైన సంస్కారమే రాఖీ పండుగ.

## రాఖీ తయారీ:

అందమైన రాఖీ తయారీ ఒక కుటీర పరిశ్రమగా దినదినాభి వృద్ధి చెందుతోంది. ఈ పరిశ్రమ ద్వారా ఈ సీజన్లో ఆర్థికంగా ఆ పరిశ్రమకు లాభాలు చేకూరుతుంది. అందమైన రాఖీ సూత్రం రంగుల్లో దాగిన భావాలు రాఖీల రూపాలు అలంకరణల్లో కూడా తమ భావాలను వ్యక్తపరుస్తారు. ఎరుపు శుభాన్ని, పసుపు మంగళాన్ని, ఆకుపచ్చ సౌభాగ్యాన్ని సూచిస్తాయని భావించి సంప్రదాయ రంగులతో రాఖీలు తయారుచేస్తారు. కొన్నింటిపై "ఓం", "శ్రీ", స్వస్తిక్ వంటి మంగళచిహ్నాలు ఉంటాయి; మరికొన్నింటిలో చిన్న పూలు, ముత్యాలు, చేతివని అలంకరణలు కనిపిస్తాయి.

పిల్లల కోసం కార్టూన్ పాత్రలతో కూడిన రాఖీలు, యువత కోసం సాదాసీదా దారంతో తయారైన మినిమల్ రాఖీలు, పెద్దల కోసం సంప్రదాయ మౌళి దారాలు కూడా వస్తున్నాయి. రూపం ఎంత మారినా, దానిని కట్టే చేతిలోని ఆప్యాయతే రాఖీలో ఉన్నప్రత్యేకత.

ఆకర్షణ కోసం ప్లాస్టిక్, గ్లిటర్, సింథటిక్ పదార్థాలతో తయారైన రాఖీలు విస్తృతంగా ఉ పయోగించబడుతున్నాయి. పర్యావరణ హిత రాఖీ సంప్రదాయానికి బాధ్యతగా పండుగ ఆనందంతో పాటు ప్రకృతిపై బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలంటే పత్తి దారం, జూట్, చేతితో నేసిన దారాలు, విత్తనాలతో తయారైన "సీడ్ రాఖీలు", సహజ రంగులతో చేసిన రాఖీలను ఎంచుకోవచ్చు. స్థానిక కళాకారులు తయారుచేసే రాఖీలను కొనడం ద్వారా చిన్న వ్యాపారులకు సహాయం చేయవచ్చు. ఖరీదైన బహుమతుల కంటే ఒక పుస్తకం, ఒక మొక్క, చేతిరాత లేఖ, కుటుంబ ఫోటో ఆల్బమ్ వంటి జ్ఞాపకార్థక బహుమతులు పండుగను మరింత వ్యక్తిగతంగా మార్చగలవు. రాఖీ పౌర్ణమి దేశమంతటా ఒకే భావంతో జరుపుకున్నప్పటికీ, విభిన్న రూపాల్లో ప్రాంతానుసారం పేర్లు, ఆచారాలు రూపాలు మారినా, రక్షణ, అనుబంధం అనే భావం మాత్రం ఒకటే. రక్షాబంధన్ ఉత్తర భారతదేశంలో కుటుంబ పండుగగా వైభవంగా జరుపుకుంటారు. దేశంలో ఉద్యోగం, వ్యాపారాల దృష్ట్యా వలసలు రావడం పెరగడంతో దక్షిణ ప్రాంత ప్రజలు సైతం రాఖీ పండుగను జరుపుకోవడం సంప్రదాయంగా మారింది. ఇదే రోజును మహారాష్ట్ర తీరప్రాంతాల్లో "నారళీ పౌర్ణిమ"గా జరుపుతూ సముద్రానికి కొబ్బరికాయ సమర్పిస్తారు.

## ఆధునిక కాలం :

రక్తసంబంధాన్ని దాటి విస్తరించిన ఈ రాఖీ కేవలం సహోదరుల మధ్యనే పరిమితం కావడం లేదు. మిత్రులు, బంధువులు, సైనికులు, సేవా రంగాల్లో పనిచేసే వారు, ప్రకృతిని కాపాడే కార్యకర్తలు, ఇలా తమకు రక్షణ, ఆదరణ, విశ్వాసం కలిగించే వారికీ రాఖీ కట్టే కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల మహిళలు సైనికులకు రాఖీలు పంపి దేశ రక్షణకు కృతజ్ఞత తెలియజేస్తారు. మరికొన్ని సంస్థలు చెట్లకు రాఖీలు కట్టి "ప్రకృతిని రక్షిద్దాం" అనే సందేశం ఇస్తాయి.

ఈ మార్పులు పండుగ యొక్క మూలమైన పరస్పర బాధ్యతను మరింత విశాలమైన సామాజిక విలువగా మలుస్తున్నాయి.

నేటి ఆధునిక స్మార్ట్‌ఫోన్ యుగంలో రాఖీ పండుగ సందర్భంగా దూరంలో ఉన్నవారికి, పనుల్లో బిజీగా ఉన్నప్పుడు. సందేశాలు పంపడం, వీడియో కాల్స్ చేయడం ద్వారా తల్లిదండ్రుల జ్ఞాపకాలతో, చిన్న నాటి అల్లర్లు నవ్వులుగా మారతాయి.

పౌర్ణమి చంద్రుడు వెలుగునిచ్చినట్లే, సోదర ప్రేమ కూడా జీవితంలో అలుముకున్న చీకటిని క్షణాల్లో ధైర్యాన్నిస్తుంది. రాఖీ కట్టే చేతి వెనుక ఆశీర్వాదం ఉ ంది. దాన్ని స్వీకరించే హృదయంలో బాధ్యత ఉంది. ఒక మిఠాయి ముక్కలో చిన్ననాటి మధుర జ్ఞాపకం ఉంది.

మన కుటుంబాన్ని, మన మూలాలను, మన బంధాలను మళ్లీ దగ్గర చేసే భావోద్వేగ ఉత్సవం. "నీవు ఒంటరివి కాదు, నేను నీకు తోడు ఉన్నాను" అనే నిశ్శబ్దమైన హామీని ప్రతి సంవత్సరం కొత్తగా కట్టే పవిత్రమైన రక్షాబంధనం ఇది.

సోదరులకు /సోదరిమణులకు "రక్షాబంధన్" శుభాకాంక్షలు.

శుభం భూయాత్

సర్వే జనా! సుఖినో భవంతు!



-శారద శృంగేరి
9490261119

---

## హిమాలయ బేబీ కేర్ 'ప్యూర్ బిగినింగ్స్ నెయ్యి గిఫ్ట్ ప్యాక్' ఆవిష్కరణ



విజయవాడ , ఆగస్టు 14, 2026: నవజాత శిశువుల కోసం హిమాలయ బేబీ కేర్ 'ప్యూర్ బిగినింగ్స్ నెయ్యి గిఫ్ట్ ప్యాక్'ను మార్కెట్లోకి విడుదల చేసింది. పాపాయికి ఇచ్చే మొదటి బహుమతి విశిష్టతను, భావోద్వేగాలను తెలియజేస్తూ కృత్రిమ మేధ సాంకేతికతతో ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ వీడియో క్యాంపెయిన్ ప్రారంభించింది. సాంకేతికత, సంస్కృతి, ప్రీమియం ఉత్పత్తుల నాణ్యతను మేళవిస్తూ నవజాత శిశువుల బహుమతుల విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. భారతీయ కుటుంబాలలో నవజాత శిశువులకు ఇచ్చే బహుమతులు కేవలం వస్తువులు మాత్రమే కాదని, అవి భావోద్వేగాలు, సంప్రదాయాలతో ముడిపడి ఉ ంటాయనే భావన ఆధారంగా ఈ క్యాంపెయిన్ రూపకల్పన జరిగింది.

సంప్రదాయ బహుమతుల శైలికి ఆధునిక స్పర్శను జోడిస్తూ ఈ ప్రచారాన్ని చేపట్టింది. ఆధునిక కుటుంబాల అవసరాలకు తగినట్లుగా సురక్షితమైన, విశ్వసనీయమైన, అర్థవంతమైన పరిరక్షణను అందించేందుకు 'హిమాలయ బేబీ ప్యూర్ బిగినింగ్స్ నెయ్యి గిఫ్ట్ ప్యాక్' ఒక అద్భుతమైన బహుమతిగా నిలుస్తుంది.

హృదయానికి హత్తుకునే విజువల్స్ ద్వారా రూపొందించిన ఈ వీడియో, నేటి కాలంలో నవజాత శిశువుల బహుమతులు కేవలం అవసరాల కోసమే కాకుండా ప్రేమ, సంరక్షణ, బాధ్యతాయుతమైన పెంపకానికి ప్రతీకగా ఎలా మారుతున్నాయో తెలియజేస్తుంది. ఏఐ ఆధారిత సృజనాత్మక విధానంతో రూపొందించిన ఈ డీవీసీ, డిజిటల్ యుగంలో మారుతున్న తల్లిదండ్రులను ఆకట్టుకోవడానికి హిమాలయ బేబీ కేర్ అనుసరిస్తున్న ఆధునిక కంటెంట్ విధానాలకు, వినూత్న కథన శైలికి అద్దం పడుతుంది.

ఈ డిజిటల్ వీడియో పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించే వెచ్చని దృశ్యాలతో ప్రారంభమవుతుంది. ఇందులో 'హిమాలయ బేబీ కేర్ ప్యూర్ బిగినింగ్స్ నెయ్యి గిఫ్ట్ ప్యాక్' ఆవిష్కృతమవుతూ పిల్లల వైద్యుల (పీడియాట్రిషియన్స్) చేత పరీక్షించబడిన ఐదు రకాల ముఖ్యమైన బేబీ కేర్ ఉత్పత్తులను చూపిస్తుంది. అవి.. ఆవు నెయ్యితో తయారు చేసిన హిమాలయ బేబీ బార్, హిమాలయ హెడ్ టు టో బేబీ వాష్, హిమాలయ బేబీ లోషన్, హిమాలయ బేబీ క్రీమ్, హిమాలయ బేబీ రాష్ రిలీఫ్ క్రీమ్. ఈ ఉత్పత్తులన్నీ చర్మవ్యాధి నిపుణులచేత పరీక్షించబడినవి. ఎటువంటి కృత్రిమ రసాయనాలు లేనివి. ఇది సురక్షితమైన, నమ్మకమైన బేబీ కేర్ ఉత్పత్తులను అందించడంలో బ్రాండ్‌కున్న నిబద్ధతను తెలియజేస్తుంది. పిల్లలకు ఇచ్చే బహుమతి అనేది కేవలం ఉత్పత్తులు మాత్రమే కాదని, వారి తొలినాళ్లలో అందించే ప్రేమ, సంరక్షణ, హాయి అని ఈ కథనం వివరిస్తుంది.

ఈ సందర్భంగా హిమాలయ వెల్నెస్ కంపెనీ బేబీ కేర్ డైరెక్టర్ ఎన్వీ చక్రవర్తి మాట్లాడుతూ హిమాలయా బేబీ కేర్‌లో నవజాత శిశువు రాకతో లభించే ప్రేమ, సంరక్షణను ప్రతిబింబించేలా పాపా యికి ఇచ్చే మొదటి బహుమతి ఎంతో ఆలోచనాత్మకమైనదిగా, పవిత్రమైనదిగా, ప్రత్యేకమైనదిగా ఉండాలని నమ్ము తామన్నారు. ప్యూర్ బిగినింగ్స్ నెయ్యి గిఫ్ట్ ప్యాక్‌తో ఒకే ప్యాక్‌లో ఆకట్టుకునే ప్యాకేజింగ్, సంప్రదాయక దినుసులు, నమ్మకమైన బేబీ కేర్ ఉత్పత్తులను మేళ వించి ఒక భిన్నమైన కానుకను అందించాల నుకు న్నామని తెలిపారు.

## నీటి కుంటలతోనే భూగర్భ జలాల పెంపు : కలెక్టర్ రాజార్షి షా



ఆదిలాబాద్, ఆగష్టు 27: నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాలను ఎంపొదించుకోవచ్చని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో వాటర్ సెడ్ నాబార్డ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి కుంట ప్రారంభోత్స వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ గార్డెన్ ను పరిశీలించారు

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నీటి కుంటల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెంపొందించి రెండు పంటల దిగుబడిని పొందవచ్చని రైతులకు సూచించారు. నీతి అయోగ్‌లో భాగంగా నార్నూర్ ను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కిచెన్ గార్డ్ ఏర్పాటుచేసిన పాఠశాల ఉ పాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్ఞానేశ్వర్. తహసీల్దార్ జాడి రాజా లింగం, డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో పుల్లారావు, వాటర్ షెడ్ డీడీఎం రౌత్ ఆఫ్, వ్యవసాయ అధికారి ఆకాష్, ఎంఈవో మనోహర్, డీఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాధిక తదితరులున్నారు.

## అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నల్గొండ, ఆగష్టు 27: ముత్యాలమ్మఅమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై, నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన శ్రీ ముత్యాలమ్మ ప్రతిష్ఠా మహోత్సవంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుభిక్షంగా జీవించాలని కోరుకున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ వనజ స్వామి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రహీముద్దీన్, నాయకులు జనార్దన్ రెడ్డి, చింటూ, భాను, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి

ఆదిలాబాద్, ఆగష్టు 27: అనాథ పిల్లలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని అన్న బావు సాఠే కమిటీ జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాంబ్లే ఉద్ధవ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో అనాథ పిల్లలకు నిత్యావసర సరుకుల తోపాటు నూతన వస్త్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నెళ్ల క్రితం తల్లి గిరిజ బాయి మృతి చెందగా, తండ్రి డోంగ్రు రావ్ ఆగష్టు 15వ తేదీన మరణించినట్లు తెలిపారు. వీరికి నలుగురు సంతానం ఉండగా అందులో ముగ్గురు అమ్మాయిలు, అబ్బాయి ఉన్నారు. ప్రస్తుతం తల్లిదండ్రుల మృతితో నలుగురు పిల్లలు అనాథ అయ్యారని తెలిపారు.

మానవ దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి పిల్లలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్ర జ్ఞానేశ్వర్, మాజీ సర్పంచ్ కోట్నాక్ కృష్ణ, దశరథ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

## నకిలీ ఐఏఎస్ అధికారులుగా అక్కాతమ్ముడు.. ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసం



భోపాల్, ఆగష్టు 27:అక్కాతమ్ముడు నకిలీ ఐఏఎస్ అధికారులుగా అవతారమెత్తారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొందరి నుంచి పది లక్షల వరకు వసూలు చేసి మోసగించారు. బాధితుల ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ట్రాప్ చేసి వారిద్దరిని అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మధ్యప్రదేశ్ పర్యాటక శాఖలో అదనపు డైరెక్టర్‌గా తృప్తి సింగ్ రాజ్‌పుత్, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలో అధిపతిగా సోదరుడు సుధాన్షు రాజ్‌పుత్ పనిచేస్తున్నట్లు కొందరిని నమ్మించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల వరకు డిమాండ్ చేశారు.

కాగా, 2025 ఏప్రిల్ 7న చందేరికి చెందిన కొందరు వ్యక్తులు రూ.9.8 లక్షలు వారికి చెల్లించారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం తమ పత్రాలను అందజేశారు. అయితే వారికి ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో తాము మోసపోయినట్లు బాధితులు గ్రహించారు. ఈ నేపథ్యంలో మూడు నెలల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అశోక్‌నగర్ ఎస్పీ రాజీవ్ మిశ్రా ఆదేశాల మేరకు ఆ బాధితులు నిందితులతో సంప్రదింపులు కొనసాగించారు. కొత్త ఉద్యోగ అభ్యర్థులు ఉన్నారని నమ్మించి వారిని తిరిగి చందేరికి రప్పించారు.

మరోవైపు తృప్తి, ఆమె సోదరుడు కారులో చందేరికి చేరుకున్నారు. దీంతో ట్రాప్ వేసిన పోలీసులు వారిద్దరిని అరెస్ట్ చేశారు. తృప్తి వద్ద ఉన్న ఖరీదైన మొబైల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను భోపాల్‌లోని వారి రహస్య స్థావరాలకు తీసుకెళ్లి ప్రశ్నిస్తున్నారు. వారి సహచరులుగా భావిస్తున్న తనుజ్ బైశ్య, అంజలి సింగ్ పేర్లను కూడా కేసులో చేర్చినట్లు పోలీస్ అధికారి తెలిపారు. వీరి మోసాలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఖానాపూర్‌లో రాఖీ పండుగ సందడి

నల్గొండ, ఆగష్టు 27: రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ వద్ద రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద మహిళలు సందడి చేశారు. రాఖీల కొనుగోళ్ల కోసం మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.

పాత బస్టాండు, తెలంగాణ చౌరస్తా, బస్టాండు, లింగాపూర్ అడ్డా ప్రాంతాల్లో మహిళల రాకపోకలతో సందడి నెలకొంది. రాఖీలు కొనుగోలు చేసేందుకు మహిళలు స్టాళ్ల వద్ద బారులు తీరారు. దీంతో ప్రధాన రహదారులు, కూడళ్లు రద్దీగా కనిపించాయి.

రాఖీలు విక్రయించేందుకు వ్యాపారులు పెద్ద సంఖ్యలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. వివిధ రకాల రాఖీలు అందుబాటులో ఉంచడంతో మహిళలు తమ సోదరుల కోసం రాఖీలను కొనుగోలు చేశారు. పండుగ నేపథ్యంలో వ్యాపారులు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి పండుగకు రెండు రోజుల ముందు మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు పుట్టింటికి వస్తుంటారని వ్యాపారులు, స్థానిక ప్రజలు తెలిపారు. దీంతో ఖానాపూర్ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.